


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 246 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కావలి, నెల్లూరుజిల్లా మంగళవారం 14 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 246 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAVALI, NELLORE DIST, TUE14 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : ,SPSR Nellore, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa, Hyderabad, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్

- ముంబైలో పవన్ కుడి భుజానికి శస్త్రచికిత్స
- మూడు వారాల పాటు ఫిజియోథెరపీ అవసరమన్న వైద్యులు
- ఆదివారం పవన్‌ను పరామర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పరామర్శించారు. భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పవన్‌ను ఫడ్నవీస్ సోమవారం కలిసి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. పవన్ కల్యాణ్ కుడి భుజానికి శనివారం సుమారు మూడున్నర గంటల పాటు వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. 2016లో ఆయన భుజానికి గాయమవగా, ఇటీవలి రాజకీయ పర్యటనల్లో అభిమానులు, కార్యకర్తల తాకిడి కారణంగా ఆ గాయం తీవ్రతరమైంది. దీంతో వైద్యులు శస్త్రచికిత్స చేయాలని సూచించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, వేగంగా కోలుకుంటున్నారని వైద్య బృందం వెల్లడించింది.

- మిగతా 2లో




## పోలవరం ప్రాజెక్టు సైట్ నుంచి 36 ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష

- పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించిన సీఎం చంద్రబాబు
- మూడేళ్లలో 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను పూర్తి చేయాలని నిర్ణయం
- ప్రాజెక్టుల కోసం రూ.35,313 కోట్లు కేటాయించనున్న ప్రభుత్వం
- జలధార పనులకు ప్రతి జిల్లాకు రూ.2 కోట్లు విడుదల చేయాలని ఆదేశం
- 1023 సాగునీటి పథకాల పునరుద్ధరణకు ఏపీఎస్ఐడీసీకి బాధ్యతలు



**పెన్ పవర్ డెస్క్:** సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, సోమవారం ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టులో కీలకమైన ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యామ్‌లోని గ్యాప్ 1, గ్యాప్ 2తో పాటు పవర్ హౌస్ నిర్మాణ పనులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం, ప్రాజెక్టు ప్రదేశం నుంచే రాష్ట్రంలోని 36 ప్రాధాన్యతా సాగునీటి ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ వర్చువల్ సమీక్షలో వివిధ జిల్లాల కలెక్టర్లు, ఆర్థిక శాఖ అధికారులు పాల్గొన్నారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందుకోసం రూ.35,313 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టు, పోలవరం ఎడమ కాలువ పనుల పురోగతి సహా ఇతర ప్రాజెక్టుల వివరాలను కూడా ఆయన అడిగి తెలుసుకున్నారు. సాగునీటి ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు

- మిగతా 2లో

## బండ్ల గణేశ్ కుమార్తె వివాహం... ఏపీ మంత్రి నారా లోకేశ్ కు ఆహ్వానం

- ఏపీ మంత్రి నారా లోకేశ్ ను కలిసిన ప్రముఖ నిర్మాత బండ్ల గణేశ్
- ఆగస్టు 16న జరగనున్న తన కుమార్తె వివాహానికి ఆహ్వానం
- లోకేష్‌ను 'నెక్స్ట్ జనరేషన్ లీడర్' అంటూ కొనియాడిన బండ్ల
- సోషల్ మీడియాలో ఈ విషయాన్ని పంచుకున్న నిర్మాత
- వైరల్ అవుతున్న బండ్ల గణేష్ పోస్ట్



**పెన్ పవర్ డెస్క్:** ప్రముఖ సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆగస్టు 16న జరగనున్న తన కుమార్తె వివాహ మహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ ఆయనకు వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ విషయాన్ని బండ్ల గణేశ్ స్వయంగా సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. "తెలుగుదేశం పార్టీ అగ్రనేత, యువతకు కాబోయే

- మిగతా 2లో

## మత్స్యకారుల మరణాలపై జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారు... ఏ ముఖం పెట్టుకుని పరామర్శిస్తారు?:



- పరామర్శల పేరుతో జగన్ దొంగ నాటకాలు ఆడుతున్నారని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శ
- విశాఖ పడవ ప్రమాద బాధితులకు 72 గంటల్లోనే రూ.10 లక్షల సాయం అందించిన ప్రభుత్వం
- వైసీపీ హయాంలో 63 మత్స్యకార కుటుంబాలను పట్టించుకోలేదని ఆరోపణ
- వేట నిషేధ భృతిని రూ.20 వేలకు పెంచి అందించిన కూటమి సర్కార్
- జువ్వలదిన్నెలో చిచ్చుపెట్టాలని చూస్తే ఊరుకోబోమని జగన్‌కు హెచ్చరిక

- మిగతా 2లో



## పోలవరం ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించిన సీఎం చంద్రబాబు

- పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన సీఎం చంద్రబాబు
- హెలికాప్టర్ నుంచి పనులను విహంగ వీక్షణం ద్వారా వీక్షించిన సీఎం
- స్పిల్‌వే, కాఫర్ డ్యామ్‌ల మధ్య పనులపై ఆరా
- గ్యాప్ 1, గ్యాప్ 2 పనులను క్షేత్రస్థాయిలో పరిశీలన
- సీఎం వెంట మంత్రి నిమ్మల రామానాయుడు, అధికారులు

**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం పోలవరం ప్రాజెక్టును పరిశీలించారు. ఏలూరు జిల్లా పర్యటనలో భాగంగా ఆయన హెలికాప్టర్‌లో ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా వీక్షించారు. స్పిల్‌వే నుంచి గోదావరి వరద నీటి ప్రవాహాన్ని, ఎగువ,

- మిగతా 2లో

## షాబాద్ నరహంతకుడు రాజ్‌కుమార్ మృతి



**పెన్ పవర్ డెస్క్:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన షాబాద్ ఆరు హత్యల కేసులో నరహంతకుడు రాజ్‌కుమార్ (29) మృతిచెందాడు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్లలోని ఓ వెంచర్‌లో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని రాజ్‌కుమార్‌గా నిర్ధరించారు. మృతదేహం పక్కన

- మిగతా 2లో

## ఒమర్ అబ్దుల్లాకు బీజేపీ షాక్.. రూ.100 కోట్ల పరువు నష్టం నోటీసు!

- ఎమ్మెల్యేల కొనుగోలుకు బీజేపీ యత్నించిందని ఒమర్ ఆరోపణ
- ఏడు రోజుల్లో బహిరంగ క్షమాపణ చెప్పాలని నోటీసులో బీజేపీ డిమాండ్
- లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరిక
- ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేసిన కాషాయదళం

**పెన్ పవర్ డెస్క్:** జమ్మూకశ్మీర్‌లో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందంటూ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన బీజేపీ, ఒమర్ అబ్దుల్లాకు రూ.100 కోట్ల పరువు నష్టం నోటీసును జారీ చేసింది. ఏడు రోజుల్లోగా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, బేషరతుగా బహిరంగ క్షమాపణ

- మిగతా 2లో



## పోలవరం, బనకచర్లపై పిటిషన్.. తెలంగాణకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ పిటిషన్
- పోలవరం, కృష్ణా జలాల వినియోగం, బనకచర్ల అంశాలపై దాఖలైన వ్యాజ్యం
- ఏపీ చేపడుతున్న పనులపై స్టే విధిస్తూ నోటీసులు జారీ చేయాలని కోరిన తెలంగాణ
- పిటిషన్‌లో తీవ్ర సాంకేతిక లోపాలున్నాయన్న ధర్మాసనం
- వాటిని సరిదిద్దకముందే ఏపీకి నోటీసులు జారీ చేయడం కుదరదని స్పష్టీకరణ

**పెన్ పవర్ డెస్క్:** అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించిన అంశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పోలవరం ప్రాజెక్టు, కృష్ణా నదీ జలాల వినియోగం, బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ అంశాలపై దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఈ కేసులో

- మిగతా 2లో



## బంకిపూర్ లో నాదే గెలుపు...



### నామినేషన్ వేసిన ప్రశాంత్ కిశోర్

- బంకిపూర్ అసెంబ్లీ ఉపఎన్నిక బరిలో ప్రశాంత్ కిశోర్
- తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలో జన సురాజ్ పార్టీ అధినేత
- ప్రజలు కొత్త రాజకీయ ప్రత్యామ్నాయం కోరుకుంటున్నారని వ్యాఖ్య
- బీజేపీ, ఆర్జేడీలతో త్రిముఖ పోటీ నెలకొన్న ఉపఎన్నిక
- అభివృద్ధి, పారదర్శక పాలనే తమ ఎజెండా అని స్పష్టీకరణ

- మిగతా 2లో

## గెలిపించిన యువతే ఇప్పుడు రోడ్డెక్కింది.. నేపాల్ ప్రభుత్వంపై జెన్‌జీ ఆగ్రహం

- 25 ఏళ్ల యువకుడి ఆత్మాహత్యతో నేపాల్‌లో భారీ నిరసనలు
- బాలేంద్ర షా ప్రభుత్వాన్ని నిలదీస్తున్న జెన్‌జీ యువత
- పేదలపై దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులు ఆపాలని డిమాండ్
- మున్సిపల్ పోలీసుల అధికార దుర్వినియోగంపై తీవ్ర విమర్శలు
- చట్టం ఇవ్వని అధికారాలను వినియోగిస్తున్నారని న్యాయ నిపుణుల ఆరోపణలు



- మిగతా 2లో

## ఆ వార్తలన్నీ అవాస్తవం.. శేఖర్ మాస్టర్‌కు నాకూ గొడవలు లేవు

**పెన్ పవర్ డెస్క్:** నృత్య దర్శకుడు శేఖర్ మాస్టర్ తో తమకు ఎలాంటి గొడవలు లేవని, తమ మధ్య యుద్ధం అంటూ వస్తున్న వార్తలు అవాస్తవమని జానీ మాస్టర్ ) అన్నారు. డ్యాన్సర్స్ అసోసియేషన్ ఎన్నికలు, సభ్యత్వాల విషయంలో ఇరు వర్గాల మధ్య విభేదాలు



- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# జగన్ వర్సెస్ బాబు.. పైచేయి ఎవరిది.. ?

రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా సాగుతున్న రాజకీయాలు గమనిస్తే.. ఎవరిది పైచేయి? అనే ప్రశ్న తరచుగా వినిపిస్తోంది. ప్రభుత్వాధినేతగా కూటమిని ముందుకు నడిపిస్తున్న చంద్రబాబు వైపు, ప్రతిపక్ష నేతగా వైసీపీ అధినేత జగన్ మరోవైపు.. పైచేయి సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు. సహజంగానే ప్రభుత్వం లో ఉన్నవారిదే పైచేయిగా ఉంటుంది. అయితే.. ఇది పరిస్థితులను బట్టి ఆధారపడి ఉంటోంది. ప్రస్తుతం ఉన్న అంచనాల ప్రకారం.. చంద్రబాబుదే పైచేయిగా ఉందని అంటున్నారు. వైసీపీ అధినేత జగన్ బయటకు రాకపోవడం, కేవలం ఇంటికే పరిమితం కావడం.. ఆయనపై మైనస్ మార్కులు వేసేలా చేస్తోంది. రెండేళ్ల తర్వాత కూడా జగన్‌లో మార్పు రాలేదన్న వాదన సొంత పార్టీలోనే వినిపిస్తుండడం మరో ప్రధాన అడ్డంకిగా మారింది. వీటికితోడు రాజధాని విషయంలో ప్రజల కోణాన్ని వదిలేశారన్న చర్చ ఉంది. మావిగన్‌పై ప్రజలకు పెద్దగా ఆసక్తి లేకపోయినా.. బలవంతంగా రుద్దే ప్రయత్నం జరుగుతుండడం కూడా జగన్ రాజకీయాలకు ఇబ్బందిగా మారిందని అంటున్నారు. వీటికితోడు.. జగన్ విషయంలో ఇంకా స్క్రిప్టు రాజకీయాలు కొనసాగుతున్నాయి. ఆయన ఏ విషయాన్నీ నేరుగా చెప్పలేకపోవడం.. పైగా తడబాట్లు వంటివి కొనసాగుతున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే.. సమాజం లో భారంగా మారిన వారికి వైసీపీ మద్దతు ఇవ్వడం కూడా ప్రజలు హర్షించలేకపోతున్నారు. దీంతో వైసీపీ వెనుకబడిందన్నది ప్రధానంగా చర్చకు వస్తోంది. ఇది జగన్‌పై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఇదే సమయంలో జగన్ అనుసరిస్తున్న ఏకపక్ష నిర్ణయాలు కూడా.. ఆయన వ్యక్తిగత ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నాయి. ఇక, చంద్రబాబు విషయానికి వస్తే.. క్లీన్ అండ్ నీట్ సీఎంగా పేరు తెచ్చుకున్నారు. ఇది ఆయనకు ప్లస్ అవుతోంది. అదే సమయంలో ప్రతిపక్షంలో 11 మాత్రమే ఉన్నప్పటికీ.. ఎప్పటికప్పుడు లోపాలను ఎత్తి చూపడంతో పాటు.. కొత్త కొత్త పేర్లతో వైసీపీ పై విరుచుకుపడుతున్న తీరుతో ప్రభుత్వంపై ఉన్న ఇమేజ్‌తో పాటు వ్యక్తిగత ఇమేజ్‌ను తగ్గకుండా చూసుకుంటున్నారు. ప్రజలకు భరోసా కల్పించే విషయంలో ఐకాన్‌గా ఉన్నారు. ఇవన్నీ కూడా జగన్‌తో పోల్చి చూసినప్పుడు చంద్రబాబు పైచేయి సాధించేందుకు వీలుగా కనిపిస్తున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

## ఆ వార్తలన్నీ అవాస్తవం.. శేఖర్ మాస్టర్‌కు నాకూ గొడవలు లేవు

- మొదటి పేజి తరువాయి

వచ్చినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆదివారం ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నట్లు వీడియోలు బయటకు వచ్చాయి. యూనియన్ పెద్దల జోక్యంతో ఆ వివాదం సద్దుమణిగింది. "ఇక్కడ ఎవరికి ఎవరూ శత్రువులు లేరు. మా యూనియన్, డ్యాన్సర్ల కోసం మేము ముందు నిలబడి పనిచేస్తాం. నేను, శేఖర్ మాస్టర్ ఈ రోజు మధ్యాహ్నం అగ్ర కథానాయకుడు చిరంజీవితో కలిసి భోజనం కూడా చేశాం. ఇద్దరం సినిమాలు, పాటలు, డ్యాన్స్ స్టెప్‌లు సహా ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాం. (అందుకు సంబంధించిన వీడియోను చూపించారు) మేమెప్పుడూ ఇలా అన్యోన్యంగా ఉంటాం. మాకు చిరంజీవిగారు ఎప్పుడూ మద్దతుగా నిలుస్తారు. ఆయనే కాదు, ఇండస్ట్రీలో ఉన్న హీరోలు, టెక్నీషియన్స్ మా ప్రతిభను ప్రోత్సహిస్తున్నారు. ఈ సందర్భంగా చిరంజీవిగారికి ధన్యవాదాలు చెబుతున్నా. సినీ పరిశ్రమలో డ్యాన్స్ మాస్టర్లు, డ్యాన్సర్లకు మంచి గుర్తింపు, స్థానం ఉందంటే అందుకు కారణం చిరంజీవిగారే. ఇది యూనియన్‌లో జరుగుతున్న చిన్న సమస్య. మళ్లీ చెబుతున్నా, మా డ్యాన్స్ మాస్టర్‌ల మధ్య ఎలాంటి యుద్ధాలు లేవు. చిన్న చిన్న విషయాల్లో అభిప్రాయభేదాలు మాత్రమే. ఇలాంటివి ప్రతి ఇంట్లోనూ ఉంటాయి" అని అన్నారు.

**ప్రశ్నించిన మాపై దుష్ప్రచారం చేస్తున్నారు: సుమలత**

డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో తాజా పరిణామాలపై అధ్యక్షురాలు సుమలత వివరణ ఇచ్చారు. "అసోసియేషన్‌లో గత కొన్ని సంవత్సరాలుగా చిన్నవో, పెద్దవో ఏవో తప్పులు జరుగుతూనే ఉన్నాయి. ఒక ప్రెసిడెంట్‌గా బాధ్యత తీసుకుని అసోసియేషన్‌ను ముందుకు నడిపించడం మామూలు విషయం కాదు. ఏది జరిగినా ప్రెసిడెంట్‌నే తప్పు బడతారు. అలా మాట రాకూడదనే నేను ప్రతి దానిని ప్రశ్నిస్తా. ముఖ్యంగా కొందరు డ్యాన్సర్ల దగ్గర డబ్బు దోచుకుంటున్నారు. నిర్మాతల దగ్గర ఒక అమౌంట్ తీసుకుని, అసోసియేషన్‌లో తక్కువ ఇస్తున్నారు. ప్రశ్నించిన మాపై దుష్ప్రచారం చేస్తున్నారు. ఇలా చేసిన వారిని సస్పెండ్ చేశాం. ఆ తర్వాత వాళ్లు రాజీనామా చేశారు. ఇది చాలా మందికి నచ్చడం లేదు. గత పాలనలో నిధుల అవకతవకలు జరిగాయి. గతేడాది ఎన్నికల్లో మేము గెలిచిన దగ్గరి నుంచి ఎన్ని మంచి పనులు చేసినా ప్రతి దానిలోనూ వేలెత్తి చూపుతున్నారు. అందుకే ఈ సమస్యలు వస్తున్నాయి" అని తెలిపారు.

## ఒమర్ అబ్దుల్లాకు బీజేపీ షాక్.. రూ.100 కోట్ల పరువు నష్టం నోటీసు!

- మొదటి పేజి తరువాయి

చెప్పాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది.

**అసలేం జరిగింది?**

ఈ నెల 11న తన నాయనమ్మ, 'మదర్-ఎ-మెహర్బాన్'గా పేరుగాంచిన బేగం అక్బర్ జహాన్ 26వ వర్ధంతి సందర్భంగా జరిగిన పార్టీ సమావేశంలో ఒమర్ అబ్దుల్లా బీజేపీపై సంచలన ఆరోపణలు చేశారు. తన నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా జమ్మూ డివిజన్‌కు చెందిన తమ పార్టీ ఎమ్మెల్యేను ఒక సీనియర్ బీజేపీ నేత సంప్రదించారని, పార్టీ మారితే రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్లు, మంత్రి పదవి, జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా ఇస్తామని ఆఫర్ చేశారని ఆరోపించారు. సుప్రీంకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న ఒక సీనియర్ బీజేపీ నేత ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించారని కూడా ఆయన పేర్కొన్నారు.

**నోటీసులో బీజేపీ డిమాండ్లు**

ఒమర్ వ్యాఖ్యలతో తమ పార్టీ ప్రతిష్ఠకు తీవ్ర భంగం కలిగిందని బీజేపీ పేర్కొంది. జమ్మూకశ్మీర్ బీజేపీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు సత్ పాల్ శర్మ ఆదేశాల మేరకు అడ్వకేట్ పరిమోక్ష్ సేథ్ ద్వారా ఈ లీగల్ నోటీసును పంపింది. ఒమర్ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, నిరాధారమైనవని, దురుద్దేశపూర్వకమైనవని నోటీసులో స్పష్టం చేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయంగా దెబ్బతీసేందుకే ఈ వ్యాఖ్యలు చేశారని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఒమర్ అబ్దుల్లా ఏడు రోజుల్లోగా ఈ ఆరోపణలను లిఖితపూర్వకంగా ఉపసంహరించుకోవాలని, బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం చేయవద్దని కూడా సూచించింది.

**చర్యలకు సిద్ధమన్న బీజేపీ**

గడువులోగా ఒమర్ స్పందించకపోతే రూ.100 కోట్ల నష్టపరిహారం కోరుతూ సివిల్ పరువు నష్టం దావా వేస్తామని బీజేపీ హెచ్చరించింది. దీంతోపాటు చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద క్రిమినల్ చర్యలు కూడా ప్రారంభిస్తామని నోటీసులో స్పష్టం చేసింది. ఈ ఆరోపణలను బీజేపీ మొదటి నుంచి ఖండిస్తోంది. రాజకీయంగా ప్రేరేపితమైన ఈ వ్యాఖ్యల వెనుక తమ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర ఉందని ఆ పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. ఈ నోటీసుతో జమ్మూకశ్మీర్ రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఒమర్ అబ్దుల్లా దీనిపై ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

# పోలవరం ప్రాజెక్టు సైట్ నుంచి 36 ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష

- మొదటి పేజి తరువాయి

దిశానిర్దేశం చేశారు.అదేవిధంగా, ఏపీఎస్ఐడీసీ (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ) ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1023 సాగునీటి పథకాల పునరుద్ధరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. రూ.3,883 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ పనుల ద్వారా సుమారు 8.42 లక్షల ఎకరాల ఆయకట్టుకు స్థిరంగా నీరందుతుందని అధికారులు అంచనా వేశారు. దీంతో పాటు, కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ ఆధునీకరణ కింద మన్యం, విజయనగరం జిల్లాల్లో ప్రత్యేక పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. భూగర్భ జలాలను పెంచేందుకు ఉద్దేశించిన 'జలధార' కార్యక్రమంపై కూడా సీఎం సమీక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా 100 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 11,133 చెరువులు, ఫీడర్ ఛానళ్లను అభివృద్ధి చేసినట్లు అధికారులు వివరించారు. ఈ పనులను వీబీజీ రామ్ జి సంస్థ ద్వారా చేపట్టాలని, జలధార పనుల కోసం ప్రతి జిల్లాకు తక్షణమే రూ.2 కోట్ల చొప్పున నిధులు విడుదల చేయాలని చంద్రబాబు ఆదేశించారు. కాగా, ఈ ఏడాది దేశంలోనే అత్యధికంగా రూ.2500 కోట్లను ఉపాధి హామీ పథకం కింద ఖర్చు చేసినట్లు అధికారులు ఈ సందర్భంగా సీఎం దృష్టికి తెచ్చారు.

## గెలిపించిన యువతే ఇప్పుడు రోడ్డెక్కింది.. నేపాల్ ప్రభుత్వంపై జెన్‌జీ ఆగ్రహం

నేపాల్‌లో 25 ఏళ్ల రైడ్‌షేరింగ్ డ్రైవర్ గణేశ్ మృతి దేశవ్యాప్తంగా నిరసనలకు దారితీసింది. గత వారం ఖాట్మండులో కస్టమర్ కోసం వేచి ఉన్న సమయంలో పోలీసులు అతని మోటార్‌సైకిల్‌కు వీల్ లాక్ వేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన గణేశ్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ మరుసటి రోజు చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఈ ఘటనతో ఇప్పటికే ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తి ఒక్కసారిగా బయటపడింది. కొన్ని నెలల క్రితమే యువత మద్దతుతో భారీ మెజారిటీ గెలుపొందిన బాలేంద్ర షా ప్రభుత్వంపై ఇప్పుడు అదే జెన్‌జీ తరం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. గత ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి మార్పు కోసం నిలిచిన యువతే ఇప్పుడు అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాన్ని జవాబుదారీతనం కోరుతూ వీధుల్లోకి దిగడం ప్రాధాన్యం సంతరించుకుంది.ఆదివారం వందలాది మంది సింగ్‌దర్బార్ సచివాలయం వద్ద ఆందోళన చేపట్టారు. 'పేదలపై దౌర్జన్యాలు ఆపండి', 'మానవ హక్కులను గౌరవించండి' వంటి నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శించారు. అక్రమ అరెస్టులను నిలిపివేయాలని, నిర్వాసితులకు ఆశ్రయం కల్పించాలని, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను మార్చాలని డిమాండ్ చేశారు.మీడియా కథనాల ప్రకారం, బాలేంద్ర షా అధికారంలోకి వచ్చిన తర్వాత ఖాట్మండు మున్సిపల్ పోలీసులు మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు, అనధికార వీధి వ్యాపారుల తొలగింపు, నదీతీర ప్రాంతాల్లోని నివాసాలను ఖాళీ చేయించే చర్యల్లో కఠిన వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ చర్యల సందర్భంగా అనేకసార్లు ఘర్షణలు చోటుచేసుకోవడంతో పేదల పట్ల ప్రభుత్వం సానుభూతితో వ్యవహరించడం లేదనే అభిప్రాయం బలపడింది.

ఖాట్మండు మెట్రోపాలిటన్ సిటీ మున్సిపల్ పోలీస్ చట్టం-2023 బాలేంద్ర షా హయాంలో అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం మున్సిపల్ పోలీసుల బాధ్యతలు నగర ఆస్తుల రక్షణ, పారిశుద్ధ్య పర్యవేక్షణ, పార్కుల సంరక్షణ, స్థానిక ఉత్సవాల నిర్వహణకు సహకరించడం వరకే పరిమితమని నిపుణులు గుర్తు చేస్తున్నారు. లాఠీచార్జ్ చేయడం లేదా ప్రజలను అదుపులోకి తీసుకునే అధికారం వారికి లేదని పేర్కొంటున్నారు.

అయినప్పటికీ, బాలేంద్ర షా ప్రభుత్వంలో మున్సిపల్ పోలీసులు రోజువారీ కూలీలు, వీధి వ్యాపారులపై తరచూ బలవంతపు చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాంటి ఘటనలకు సంబంధించిన వీడియోలు గత కొంతకాలంగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇప్పుడు గణేశ్ మృతి ఆ అసంతృప్తికి మరింత ఆజ్యం పోసి నేపాల్‌లో మరోసారి భారీ నిరసనలకు కారణమైంది.

## పోలవరం ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య జరుగుతున్న పనులను ఆయన విహంగ వీక్షణం ద్వారా పరిశీలించారు.అనంతరం, క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రాజెక్టు పనుల పురోగతిపై ఆరా తీశారు. ముఖ్యంగా ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం (ఈసీఆర్ఎఫ్)లోని గ్యాప్ 1, గ్యాప్ 2 పనులతో పాటు, నిర్మాణంలో ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని కూడా ఆయన పరిశీలించారు. ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, పనుల వివరాలను అధికారులు సీఎంకు వివరించారు.ముఖ్యమంత్రి పర్యటనలో ఆయన వెంట జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖకు చెందిన ఉన్నతాధికారులు ఉన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు

పనుల పురోగతిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది.

## మత్స్యకారుల మరణాలపై జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారు... ఏ ముఖం పెట్టుకుని పరామర్శిస్తారు?

ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలను దారుణంగా మోసం చేసి, నట్టేట ముంచి, ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని పరామర్శల పేరుతో దొంగ నాటకాలు ఆడుతున్నారని వైసీపీ అధినేత జగన్ పై రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం నాడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్యకారుల కడుపు కొట్టి, వారి నోటికాడి కూడు లాక్కున్న జగన్ రెడ్డి.. ఇప్పుడు పెద్ద యోగ్యుడిలా పరామర్శల డ్రామాలు ఆడటం సిగ్గుచేటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.విశాఖపట్నం సముద్ర తీరంలో ఇటీవల జరిగిన పడవ ప్రమాదంపై ప్రభుత్వం తక్షణం స్పందించిందని కొల్లు రవీంద్ర తెలిపారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో నేవీ, కోస్ట్ గార్డ్ బృందాలను రంగంలోకి దించి గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన మత్స్యకారుడు చిన్నా అందించిన సమాచారంతో 72 గంటల పాటు గాలించినా మిగతా ఆరుగురి ఆచూకీ లభించలేదన్నారు. కోస్ట్ గార్డ్, త్రీ-మెన్ కమిటీ నివేదికల ఆధారంగా వారు మరణించినట్లు నిర్ధారించి, కేవలం 72 గంటల వ్యవధిలోనే బాధిత కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందించామని వివరించారు. భారతదేశ చరిత్రలోనే ఇంత వేగంగా సాయం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.ఇలాంటి దురదృష్టకర ఘటనను కూడా జగన్ రాజకీయం చేస్తున్నారని కొల్లు రవీంద్ర మండిపడ్డారు. "ప్రభుత్వం బాధితులకు కొండంత ధైర్యాన్నిస్తే.. మీరు శవ రాజకీయాలు చేయడానికి వెళ్తున్నారా?" అని ప్రశ్నించారు. గతంలో వైజాగ్ హార్బర్‌లో 45 బోట్లు కాలి బూడిదైతే కనీసం పలకరించని జగన్, ఇప్పుడు డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. తన ఐదేళ్ల పాలనలో 63 మంది మత్స్యకారులు సముద్రంలో గల్లంతై చనిపోతే, వారి కుటుంబాలకు డెత్ సర్టిఫికెట్లు కూడా ఇప్పించలేని దౌర్భాగ్యపు ముఖ్యమంత్రి జగన్ అని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ 63 కుటుంబాలకు రూ. 3.15 కోట్ల సాయం అందించి ఆదుకుందన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారులకు అండగా నిలుస్తోందని రవీంద్ర వివరించారు. వేట నిషేధ భృతిని ఏకంగా రూ. 20,000కి పెంచి, రూ. 258 కోట్లకు పైగా నిధులను వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. మత్స్యకారుల చెరువుల హక్కులను కాలరాసేందుకు జగన్ తెచ్చిన దుర్మార్గపు జీవో నెం. 217ను రద్దు చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు రాష్ట్ర వాటా ఇవ్వకుండా నిర్వీర్యం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని

ఎద్దేవా చేశారు.గతంలో హుద్‌హుద్ తుపాను సమయంలో చంద్రబాబు దెబ్బతిన్న బోట్లకు రూ. 6 లక్షల చొప్పున సాయం అందించారని, వేలమంది ఆక్వా రైతులను ఆదుకున్నారని గుర్తుచేశారు. మత్స్యకారుల రక్షణ కోసం 4,560 శాటిలైట్ ట్రాన్స్‌పాండర్లను ఉచితంగా అందించామని, 9 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాన్ని వేగవంతం చేశామని తెలిపారు.

జువ్వలదిన్నె వంటి చోట్ల కులాల మధ్య చిచ్చులు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఐదేళ్ల పాలనలో మత్స్యకారులకు ఏం చేశారో దమ్ముంటే చర్చకు రావాలని జగన్‌కు సవాల్ విసిరారు. మత్స్యకారులకు ఏ మేలు జరిగినా అది తెలుగుదేశం, కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమైందని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

## పోలవరం, బనకచర్లపై పిటిషన్.. తెలంగాణకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

- మొదటి పేజి తరువాయి

మొత్తం 15 మంది ప్రతివాదులు ఉన్నారని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న పనులపై తక్షణమే స్టే విధిస్తూ నోటీసులు జారీ చేయాలని కోర్టును తెలంగాణ తరపు న్యాయవాది కోరారు. అయితే, తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్‌లో తీవ్ర సాంకేతిక లోపాలు ఉన్నాయని ధర్మాసనం గుర్తించింది. వాటిని సరిచేసే వరకు విచారణ చేపట్టలేమని స్పష్టం చేసింది. ప్రాథమిక లోపాలు సరిదిద్దకముందే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయడం గానీ, మధ్యంతర ఉత్తర్వులు (ఇంజెక్షన్/స్టే) ఇవ్వడం గానీ సాధ్యం కాదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ముందుగా పిటిషన్‌లోని లోపాలను సవరించాలని తెలంగాణ ప్రభుత్వానికి సూచించింది. ఆ తర్వాతే మిగిలిన అంశాలపై విచారణ చేపడతామని పేర్కొంది. అనంతరం కేసు విచారణను వాయిదా వేసింది.

## పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్

- మొదటి పేజి తరువాయి

ఆదివారం నాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు ఆసుపత్రికి వెళ్లి పవన్‌ను పరామర్శించారు. ఆయనను విశ్రాంతి తీసుకోవాలని కోరుతూ, త్వరగా కోలుకుని ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు పవన్ మూడు వారాల పాటు ఫిజియోథెరపీ తీసుకోవాల్సి ఉంటుంది. ఆరు నెలల తర్వాత ఆయన ఎడమ భుజానికి కూడా వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఫడ్నవీస్ పరామర్శ రాజకీయాలకు అతీతంగా నాయకుల మధ్య ఉన్న సౌభ్రాతృత్వానికి నిదర్శనంగా నిలిచింది. తనను పరామర్శించినందుకు ఫడ్నవీస్‌కు పవన్ కృతజ్ఞతలు తెలిపారు.

## షాబాద్ నరహంతకుడు రాజ్‌కుమార్ మృతి

- మొదటి పేజి తరువాయి

పాయిజన్ బాటిల్‌ను గుర్తించారు. నిందితుడు ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది.ఓ బాలికను వేధించిన వ్యవహారంలో తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో రాజ్‌కుమార్ శుక్రవారం అర్ధరాత్రి ఉన్మాదిగా మారి నరమేధం సృష్టించాడు. తొలుత బాలిక తల్లి, నానమ్మలను కత్తిపోట్లతో కడతేర్చాడు. తర్వాత నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బాలికను గొంతుకోసి చంపేశాడు. అనంతరం ఇంటికెళ్లి భార్య, నిద్రిస్తున్న కన్న బిడ్డల గొంతుకోసి కర్కశంగా హతమార్చాడు. మొత్తం అరగంట వ్యవధిలో మూడు ప్రాంతాల్లో ముగ్గురు మహిళలు, ఓ బాలిక, ఇద్దరు ముక్కుపచ్చలారని చిన్నారుల్ని కిరాతకంగా అంతమొందించాడు. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు 14 ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. హైదరాబాద్-బెంగళూరు హైవేల్లోని హోటళ్లు, లాడ్జీలు, దాబాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. నిందితుడి కుటుంబసభ్యులు, సన్నిహితులను ప్రశ్నించారు. ఈ క్రమంలో సోమవారం పెంజర్లలో రాజ్‌కుమార్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. జీవితంపై విరక్తి కలిగిందంటూ.. రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో..మృతికి ముందు రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. మృతదేహం పక్కన ఉన్న అతడి మొబైల్ ఫోన్‌లో ఈ వీడియోను గుర్తించినట్లు ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి తెలిపారు. రాజ్‌కుమార్‌కు బెట్టింగ్ అలవాటు ఉందని.. దీనికోసం 16 సిమ్‌లు వినియోగించినట్లు చెప్పారు. ఆన్‌లైన్ బెట్టింగ్ కారణంగా అప్పుల బాధతో జీవితంపై విరక్తి కలిగిందని.. ఓ అమ్మాయిని నమ్మి చాలా మోసపోయానని సెల్ఫీ వీడియోలో రాజ్‌కుమార్ పేర్కొన్నాడు. 2.26 సెకన్ల నిడివి గల ఈ వీడియోను మీడియా ప్రతినిధులకు సీపీ చూపించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వీడియో రికార్డు చేసినట్లు తెలిపారు.

## బంకిపూర్ లో నాదే గెలుపు...

బీహార్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ప్రముఖ రాజకీయ వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ (పీకే) తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగుతుండడం తెలిసిందే. బంకిపూర్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉపఎన్నికల్లో ఆయన పోటీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన సోమవారం నాడు పాట్నా కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ సీనియర్ నాయకులు, మద్దతుదారులతో కలిసి వచ్చి ఆయన తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కిశోర్ మీడియాతో మాట్లాడుతూ, ఉపఎన్నిక ఫలితంపై ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రచారానికి ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని, ఓటర్లు కొత్త రాజకీయ ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. సంప్రదాయ రాజకీయాలకు విసిగిపోయిన ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అందువల్ల ఈ పోటీ తమకు ఏమాత్రం కష్టం కాదని తెలిపారు. ఈ ఎన్నికల తీర్పు రాష్ట్రంలో రాజకీయ మార్పుకు నాంది పలుకుతుందని, జన్ సురాజ్ విజన్ పట్ల పెరుగుతున్న మద్దతుకు ఇది నిదర్శనంగా నిలుస్తుందని ప్రశాంత్ కిశోర్ విశ్వాసం వ్యక్తం చేశారు. బంకిపూర్ ప్రజలు కుల సమీకరణాలు, పాత రాజకీయాలకు బదులుగా అభివృద్ధి, సుపరిపాలన ఆధారిత రాజకీయాలను కోరుకుంటున్నారని పీకే పేర్కొన్నారు. నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు, మెరుగైన మౌలిక సదుపాయాలు, పారదర్శక పాలనే తమ పార్టీ ప్రధాన ఎజెండా అని స్పష్టం చేశారు. బీహార్‌లో అత్యంత ఆసక్తికరంగా మారిన ఈ ఉపఎన్నికలో బీజేపీ, ఆర్జేడీ వంటి ప్రధాన పార్టీలు కూడా తమ అభ్యర్థులను నిలబెట్టాయి. దీంతో ఇక్కడ త్రిముఖ పోరు నెలకొంది.

## బండ్ల గణేశ్ కుమార్తె వివాహం... ఏపీ మంత్రి నారా లోకేశ్ కు ఆహ్వానం

- మొదటి పేజి తరువాయి

నాయకుడు (నెక్ట్స్ జనరేషన్ లీడర్), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ల శాఖ మంత్రి నారా లోకేశ్ గారిని కలవడం జరిగింది. మా కుమార్తె వివాహ వేడుకకు విచ్చేసి, నూతన వధూవరులను ఆశీర్వదించాల్సిందిగా వారిని ఆహ్వానించాను" అని తన పోస్టులో పేర్కొన్నారు. ఈ వివాహ వేడుకకు సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. బండ్ల గణేశ్ కుమార్తె జనని వివాహం పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన చిలుకూరి సూర్యతేజతో ఆగస్టు 16న జరగనుంది. గత మే 3వ తేదీన వీరి నిశ్చితార్థం హైదరాబాదులో ఘనంగా జరిగింది.

# వసతులు కల్పించే ఖాళీ చేయిస్తాం



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జులై 13.** గాంధీ నగర్ లో పాత గుడిపల్లి కాలువపై నివాసం ఉంటున్న పేదలను వారి అందరికీ నివాసి యోగ్యమైన గృహాలు నిర్మించి మౌలిక వసతులు కల్పించిన తర్వాతే వారిని ఆ ప్రాంతం నుండి ఖాళీ చేయిస్తామని చైర్పర్సన్ మోర్ల సుప్రజ మరియు మున్సిపల్ కమిషనర్ చినబాబు తెలిపారు. వారం రోజులుగా తాము నివాసం ఉంటున్న ప్రాంతంలో కొత్త వ్యక్తులు వచ్చి కొలతలు వేస్తూ ఇక్కడ సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నామని మీరందరూ ఇల్లు ఖాళీ చేసుకోవాలని చెబుతున్నారు. దీంతో వీరు భయభ్రాంతులకు లోనై సిపిఎం పార్టీ కార్యాలయానికి వెళ్లి తెలిపారు. దీంతో సిపిఎం పార్టీ నాయకులు సోమవారం నాడు చైర్పర్సన్ మరియు కమిషనర్ను కలిసి వారి ఆందోళన తెలియపరిచారు. దీనికి వారు వీరందరికీ ఇప్పటికే ఇళ్ల స్థలాలు కేటాయించామని ఇల్లు కూడా నిర్మించామని అక్కడ సరైన వసతులు కల్పిస్తామని తెలిపారు. దీనికి నాయకులు అక్కడ నిర్మించిన గృహాలు కాంట్రాక్టర్ నాసిరకంగా నిర్మించారని బేస్ మట్టాలు కూడా పూర్తి కాలేదు అని గృహాల నిర్మాణంలోఅవినీతి జరిగిందని అవి నివాసయోగంగా లేవని ఆందోళనగా తెలిపారు. ఈ విషయం వెంటనే ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి వాటి నిర్మాణాలను సరి చేయించే ప్రయత్నం చేస్తామని ఆ తర్వాత మాత్రమే ఇల్లు ఖాళీ చేస్తామని వారు తెలిపారు. సిపిఎం పార్టీ నాయకులు మాట్లాడుతూ సిమెంటు రోడ్డు నిర్మాణం 15 అడుగుల లోబడి నిర్మించుకుంటే వీరి గృహాలకు ఎటువంటి ఇబ్బందులు ఉండదని అధికారులు పరిశీలించాలన్నారు. గతంలో కూడా కూరగాయల మార్కెట్ నిర్మాణ సమయంలో అక్కడ నిరసన పేదలను అధ్యంతరంగా ఖాళీ చేయించారని వారికి ఇప్పటికి కూడా నివాస గృహాలు ఏర్పాటు చేయలేదన్నారు. అధికారులు పరిశీలించి అక్కడ నివాసముంటున్న రేషన్ కార్డు లేని పేదలందరికీ స్థలాలు ఇల్లు మంజూరు చేయాలన్నరు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా నాయకులు ముత్యాల గురునాథం, చల్లకొలుసు మల్లికార్జునరావు, మండల నాయకులు పోతంశెట్టి శ్రీనివాసులు, షేక్ జానీ భాష, దత్త శ్రీ కోటయ్య, కొమ్మ శ్రీనివాసులు కార్యకర్తలు పాల్గొన్నారు

# సినుకమ్మా,ఒక్కసారి వచ్చిపోవమ్మా!

## వరుణుడి కరుణ లేక ఆందోళనలో అన్నదాతలు,ఎదురుచూస్తున్న రైతన్నలు



**పెన్ పవర్,ప్యాపిలి:** ఖరీఫ్ సీజన్ ప్రారంభమై చాలా రోజులు గడుస్తున్నా మండలంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఇప్పటి వరకు ఒక్క మోస్తరు వర్షం కూడా కురవకపోవడంతో రైతాంగం తీవ్ర ఆందోళనకు గురవుతోంది. సాధారణంగా ఈ సమయానికి పొలాలు పచ్చని పంటలతో కళకళలాడాల్సి ఉండగా, ప్రస్తుతం ఎండిన నేలలు, వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులే కనిపిస్తున్నారు. వరుణదేవుడి కరుణ కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ సీజన్లో పత్తి, టమోటా,సజ్జ,కంది తదితర పంటల సాగు కోసం రైతులు ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేశారు. కొందరు అప్పులు చేయగా, మరికొందరు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని పెట్టుబడులు పెట్టారు. ప్రారంభంలో ఒకటి, రెండు సార్లు చిరుజల్లులు కురవడంతో ఆశలు చిగురించి విత్తనాలు వేశారు. అనంతరం వర్షాలు పూర్తిగా ముఖం చాటేయడంతో నేలలో తేమ లేక విత్తనాలు, మొలకెత్తిన పంటలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు.వర్షాలు ఆలస్యమైతే రెండోసారి విత్తనాలు వేయాల్సిన పరిస్థితి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పెట్టుబడి మరింత పెరిగి ఆర్థికంగా తీవ్ర నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని చెబుతున్నారు.వ్యవసాయ పనులపై ఆధారపడే కూలీల పరిస్థితి కూడా ఆందోళనకరంగా మారింది. పొలాల్లో పనులు లేక ఉపాధి కోల్పోయిన కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితులు నెలకొంటున్నాయని గ్రామస్తులు తెలిపారు. పశువులకు మేత కొరత ఏర్పడే ప్రమాదం కూడా రైతులను కలవరపెడుతోంది. వాతావరణంలో మేఘాలు కనిపిస్తున్నప్పటికీ వర్షం కురవకపోవడం, రైతుల్లో మరింత ఆందోళన కలిగిస్తోంది. మరో వారం రోజుల్లో మంచి వర్షాలు కురవకపోతే ఖరీఫ్ సాగు తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉందని గ్రామాల రైతులు వాపోతున్నారు. వర్షాలు కురిసి పంటలను కాపాడాలని రైతులు దేవుడిని ప్రార్థిస్తున్నారు.

# మరో 24 గంటలే సమయం!

## ఎక్కడ వాళ్లు అక్కడే ఆగిపోండి ఏ పనిలో ఉన్నా సరే వెంటనే ఇంటికి వెళ్లండి
## నాయుడుపేట పట్టణ అధ్యక్షులు 786 రఫీ



**నాయుడుపేట, పెన్ పవర్, జూలై 13** నాయుడుపేట పట్టణ ప్రజలకు తెలియపరచు ఏమనగా ఓటు హక్కును కోల్పోకుండా ఉండాలంటే సర్ ప్రక్రియను పూర్తి చేసుకోండి ఎన్యూమరేషన్ ఫారం ని తీసుకుని సంతకం పెట్టి, తాజా ఫోటోను జతచేసి మీ సచివాలయం వద్ద వేచి ఉన్న బూత్ లెవెల్ అధికారికి అందజేయండి. ఇంటికి ఫారం రానివారు మీ ఓటరు కార్డు తీసుకొని సంబంధిత బూత్ లెవల్ అధికారిని సంప్రదించండి, ఏ వార్డులో ఏ బూత్ లో మీ ఓటు ఉందో తెలుసుకోండి.. అక్కడకి వెళ్లి, ఎన్యూమరేషన్ ఫారం ను నింపి తాజా ఫోటోతో సహా సమర్పించండి ఓటు హక్కును కోల్పోకుండా ఉండాలంటే సర్ ప్రక్రియకు సహకరించండి నిర్లక్ష్యం చేస్తే ఓటు గల్లంతవుతుంది, సర్ -2026 లో భాగంగా, ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ ఫారం నింపి బూత్ స్థాయి అధికారులకు ఇస్తేనే ఓటర్ జాబితాలో పేరు ఉంటుంది లేదంటే ఓటు గల్లంతు అవుతుంది. మాకు ఓటర్ ఐడీ ఉంది.. గత ఎన్నికల్లో ఓటు వేశాం. మాకేమవుతుంది అని అనుకోవద్దు...

# వసతులు కల్పించే ఖాళీ చేయిస్తాం



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జులై 13.** గాంధీ నగర్ లో పాత గుడిపల్లి కాలువపై నివాసం ఉంటున్న పేదలను వారి అందరికీ నివాసి యోగ్యమైన గృహాలు నిర్మించి మౌలిక వసతులు కల్పించిన తర్వాతే వారిని ఆ ప్రాంతం నుండి ఖాళీ చేయిస్తామని చైర్పర్సన్ మోర్ల సుప్రజ మరియు మున్సిపల్ కమిషనర్ చినబాబు తెలిపారు. వారం రోజులుగా తాము నివాసం ఉంటున్న ప్రాంతంలో కొత్త వ్యక్తులు వచ్చి కొలతలు వేస్తూ ఇక్కడ సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నామని మీరందరూ ఇల్లు ఖాళీ చేసుకోవాలని చెబుతున్నారు. దీంతో వీరు భయభ్రాంతులకు లోనై సిపిఎం పార్టీ కార్యాలయానికి వెళ్లి తెలిపారు. దీంతో సిపిఎం పార్టీ నాయకులు సోమవారం నాడు చైర్పర్సన్ మరియు కమిషనర్ను కలిసి వారి ఆందోళన తెలియపరిచారు. దీనికి వారు వీరందరికీ ఇప్పటికే ఇళ్ల స్థలాలు కేటాయించామని ఇల్లు కూడా నిర్మించామని అక్కడ సరైన వసతులు కల్పిస్తామని తెలిపారు. దీనికి నాయకులు అక్కడ నిర్మించిన గృహాలు కాంట్రాక్టర్ నాసిరకంగా నిర్మించారని బేస్ మట్టాలు కూడా పూర్తి కాలేదు అని గృహాల నిర్మాణంలోఅవినీతి జరిగిందని అవి నివాసయోగంగా లేవని ఆందోళనగా తెలిపారు. ఈ విషయం వెంటనే ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి వాటి నిర్మాణాలను సరి చేయించే ప్రయత్నం చేస్తామని ఆ తర్వాత మాత్రమే ఇల్లు ఖాళీ చేస్తామని వారు తెలిపారు. సిపిఎం పార్టీ నాయకులు మాట్లాడుతూ సిమెంటు రోడ్డు నిర్మాణం 15 అడుగుల లోబడి నిర్మించుకుంటే వీరి గృహాలకు ఎటువంటి ఇబ్బందులు ఉండదని అధికారులు పరిశీలించాలన్నారు. గతంలో కూడా కూరగాయల మార్కెట్ నిర్మాణ సమయంలో అక్కడ నిరసన పేదలను అధ్యంతరంగా ఖాళీ చేయించారని వారికి ఇప్పటికి కూడా నివాస గృహాలు ఏర్పాటు చేయలేదన్నారు. అధికారులు పరిశీలించి అక్కడ నివాసముంటున్న రేషన్ కార్డు లేని పేదలందరికీ స్థలాలు ఇల్లు మంజూరు చేయాలన్నరు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా నాయకులు ముత్యాల గురునాథం, చల్లకొలుసు మల్లికార్జునరావు, మండల నాయకులు పోతంశెట్టి శ్రీనివాసులు, షేక్ జానీ భాష, దత్త శ్రీ కోటయ్య, కొమ్మ శ్రీనివాసులు కార్యకర్తలు పాల్గొన్నారు

# బుచ్చి పోలీసు స్టేషన్ లో 25 మంది బదిలి

### హత్యకేసు లో ఆరోపణలు ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల సంచలన నిర్ణయం



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జూలై 13:** నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డి పాళెం పోలీసు స్టేషన్ లో విధుల్లో ఉన్న సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ సంతోష్ రెడ్డి లతో పాటు మరో 23 మంది ని జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల బదిలి చేయడం తో పోలీసు శాఖలో సంచలనం గా మారింది. పోలీసుల వివరాల ప్రకారం గత నెల బుచ్చిరెడ్డి పాళెం పక్క గ్రామం అయిన మినగల్లు కి చెంది శ్రీహరి అనే వ్యవసాయ అధికారి మృతి చెందిన సంఘటన పై భార్య ఇచ్చిన ఫిర్యదుతో ఎస్పీ విచారణ చేపట్టగా శ్రీహరిది హత్య అని తేలింది. హత్య చేసిన నిందిడులైన గొలగమూడి, రామతీర్థానికి చెందిన వ్యక్తులు పోలీసులకు చిక్కగ, హత్య కు సూత్ర దారి ప్రధాన నిందితుడు బాలకృష్ణ దొరకక పోవడంతో పోలీసులు తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ కేసు విచారణ లో కేసు మాఫి చేసేందుకు భారీ మొత్తం లో బుచ్చి రెడ్డి పాళెం పోలీసులు చేతులు తడిసినట్లు తేలడంతో సిఐ, ఎస్ఐ, సిబ్బందిని కలిపి 25 మందిని ఎస్పీ బదిలి చేసింది. ఈ సంఘటన పోలీసు శాఖలో అవినీతి అధికారులకు హెచ్చరికలా మారింది. జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల తీసుకున్న నిర్ణయానికి జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా | తిరుపతి | చిత్తూరు | వై.ఎస్.ఆర్. కడప

# ఎస్ఐఆర్ గడువు పొడిగించాలి: సీపీఐ




**పెన్ పవర్,ప్యాపిలి:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును మరో మూడు నెలలు పొడిగించాలని సీపీఐ డిమాండ్ చేసింది. అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు సీపీఐ మండల కార్యదర్శి మహేష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సోమవారం తహసిల్దార్ కార్యాలయ ఆవరణంలో సీనియర్ అసిస్టెంట్ సుధాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఎన్యూమరేషన్ ప్రక్రియ ఇంకా పూర్తికాలేదన్నారు. అర్హులైన వేలాది మందికి ఫారాలు అందలేదని, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలో సాంకేతిక సమస్యలు, బీఎల్‌వోల నిర్లక్ష్యం, ఫారాల అప్‌లోడ్‌లో జాప్యం వంటి కారణాలతో నిజమైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ గడువును మూడు నెలలు పొడిగించి, ఇంటింటా సమగ్ర సర్వే నిర్వహించి అర్హులందరి పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేయాలని, సాంకేతిక లోపాలను వెంటనే సరిదిద్ది మొత్తం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యకర్తలు మాధవరం గోవిందు, జలదుర్గం నాగేంద్ర, రాము, వెంకటేష్, రవి, రాజేష్, నాగప్ప, సుంకన్న, శ్రీను తదితరులు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

# అక్కగారి పేట వద్ద నేషనల్ హైవే అండర్ పాస్ ను ఉపయోగంలోకి తీసుకురావాలి



**పెళ్లకూరు, పెన్ పవర్, జూలై 13 :** పెళ్ళకూరు మండలం అక్క గారి పేట వద్ద నేషనల్ హైవే 71 పై నిర్మించిన అండర్ పాస్ ను ఉపయోగంలోకి తీసుకురావడంతో పాటు రైతులు ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పెళ్లకూరు జడ్పిటిసి సభ్యులు నన్నం ప్రిస్కిల్లా సోమవారం నేషనల్ హైవే పిడి వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జడ్పిటిసి సభ్యులు నన్నం ప్రిస్కిల్లా మాట్లాడుతూ పెళ్లకూరు మండలం అక్కగారిపేట వద్ద నేషనల్ హైవే 71 పై నిర్మించిన అండర్పాస్ పనులు అసంపూర్తిగా ఉండటం వల్ల నిరుపయోగంగా ఉందని తెలిపారు. దీనితో గ్రామ ప్రజలు హైవే ను దాటేందుకు సుదూరం నడిచి వెళ్లాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, పొలాల్లోకి వెళ్లే రైతులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదని తెలిపారు. అలాగే పెళ్లకూరు మండల పరిధిలో నేషనల్ హైవే 71 నిర్మాణ సమయంలో పంట కాలవలు హైవే లో కలిసిపోవడం వల్ల పొలాలకు సాగునీరు అందే పరిస్థితి లేదన్నారు. అక్కగారిపేట వద్ద ఏర్పాటు అండర్ పాస్ సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయాలని కోరారు. అక్కగారిపేట గ్రామ వ్యవసాయ పొలాలకు నెల్లుబల్లి చెరువు నీరు రావలసి ఉందన్నారు. కాగా నెల్లుబల్లి చెరువు నుండి వచ్చే పంట కాలవ నేషనల్ హైవే 71 లో కలిసిపోవడంతో సాగునీరు అందే పరిస్థితి లేదన్నారు. నెల్లుబల్లి చెరువు నుండి అక్కగారిపేట వ్యవసాయ పొలాలకు వస్తున్న పంట కాలవను పునరుద్ధరించాలని కోరారు. పై సమస్యలను వెంటనే పరిష్కరించి అక్కగారిపేట గ్రామ ప్రజలను రైతులు ఆదుకోవాలని జడ్పిటిసి సభ్యులు నేషనల్ హైవే పిడిని కోరారు.

# మెడికల్ క్యాంపును పరిశీలించిన తాసిల్దార్ అంబటి వెంకటేశ్వర్లు



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జులై 13 :** నాగమంబాపురం 'ఎస్ ఐ ఆర్' ( ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమం పరిశీలనలో భాగంగా పర్యటించిన మండల తాసిల్దార్ అంబటి వెంకటేశ్వర్లు అక్కడ ఏర్పాటు చేసిన 104 మెడికల్ క్యాంపును సందర్శించారు. క్యాంపులో అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకోవడమే కాకుండా, స్వయంగా తన ఆరోగ్య పరీక్షలు (బిపి షుగర్, హిమోగ్లోబిన్) చేయించుకుని, ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఉన్నతాధికారులే స్వయంగా పరీక్షలు చేయించుకోవడం స్థానికులకు ఎంతో స్ఫూర్తినిచ్చింది. ఈ కార్యక్రమంలో మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు

# షేక్ జైనబ్ కి డాక్టరేట్ ప్రదానం



**పెన్ పవర్,ప్యాపిలి:** పద్మావతి మహిళా వర్సిటీ ఆంగ్ల పరిశోధక విద్యార్థిని ప్యాపిలికి చెందిన షేక్ జైనబ్ కి డాక్టరేట్ ప్రధానం చేసినట్లు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రో కె. అనురాధ వెల్లడించారు. ఆమె ఆచార్య టి. భారతీ పర్యవేక్షణలో 'ముస్లిం విమెన్ ఆటోబయోగ్రఫీస్: ఎ క్రిటికల్ స్టడీ' అంశంపై పరిశోధనా గ్రంధాన్ని సమర్పించారు. ఇందుకు గాను ఆమెకు డాక్టరేట్ ప్రధానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా షేక్ జైనబ్ కి పలువురు విద్యార్థులు, ఆచార్యులు అభినందనలు తెలిపారు.

# నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం

## ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు రోటరీ ముందడుగు



**నాయుడుపేట, పెన్ పవర్, జూలై 13 :** నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చే వేలాది మంది ప్రయాణికులకు సురక్షిత తాగునీరు అందించేందుకు ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. బెస్ట్ రన్నర్స్ యూఎస్ఏ ఆర్థిక సహాయంతో నాయుడుపేట రోటరీ క్లబ్ రూ 2 50 లక్షల వ్యయంతో ఈ ప్లాంట్ నిర్మించింది. సోమవారం బస్టాండ్ ఆవరణంలో జరిగిన కార్యక్రమంలో రోటరీ నాయకులు ఆర్టీసీ అధికారులు రిబ్బన్ కట్ చేసి ప్లాంట్ ప్రారంభించారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ నాగురయ్య మాట్లాడుతూ సూళ్లూరుపేట డిపో మేనేజర్ కళ అభ్యర్థన మేరకు ఈ ప్లాంట్ వేగంగా ఏర్పాటు చేశామన్నారు. ప్లాంట్ నిర్వహణ బాధ్యత డిపో మేనేజర్ చూసుకోవాలని ప్రయాణికులకు నిరంతరం ప్యూర్ వాటర్ అందేలా పర్యవేక్షించాలని సూచించారు భవిష్యత్తులోనూ ఆర్టీసీ అభివృద్ధికి ప్రయాణికుల సౌకర్యార్థం మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. డిఎం కళ మాట్లాడుతూ విన్నపాన్ని స్వీకరించి ప్లాంట్ ఇచ్చిన బెస్ట్ రన్నర్స్ యూఎస్ఏ కు రోటరీ క్లబ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ పి కేశవరెడ్డి పిడిజి మునిగిరేష్ డిజిఎన్ మాధవరెడ్డి అసిస్టెంట్ గవర్నర్ జయరాజగోపాల్ సెక్రటరీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. గూడూరు, కోట, సూళ్లూరుపేట,కావలి రోటరీ క్లబ్ ప్రతినిధులు ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులు హాజరయ్యారు.

# నాయుడుపేటకు మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి.

## పీవీ కుమార్ రెడ్డి కుటుంబానికి పరామర్శ



**నాయుడుపేట,పెన్ పవర్, జూలై 13** మాజీ కేంద్రమంత్రి, ప్రస్తుత టీటీడీ బోర్డు మెంబర్ గౌరవనీయులు శ్రీమతి పనబాక లక్ష్మి మరికొద్ది సేపట్లో నాయుడుపేట పట్టణానికి చేరుకోనున్నారు. ప్రముఖ నాయకులు పీవీ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు ఆమె విచ్చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, స్థానికలు తో కలిసి ఆమె నేరుగా నాయుడుపేటలోని ఎస్ వి టి హాల్ వద్దకు చేరుకుని, కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి వారిని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పనబాక లక్ష్మి రాకను పురస్కరించుకుని కూటమి శ్రేణులు, టిడిపి ముఖ్య నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బుచ్చి సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శివరామకృష్ణారెడ్డి



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జూలై 13 :** బుచ్చి సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా శివరామకృష్ణారెడ్డి నేడు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీసు కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇప్పటి వరకు సీఐగా విధులు నిర్వహించిన శ్రీనివాసరావును వీఆర్‌కు బదిలీ చేసిన నేపథ్యంలో, శివరామకృష్ణారెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గుంటూరు రేంజ్ ఐజీ ఆదేశాలు, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల సూచనల మేరకు బుచ్చిరెడ్డిపాలెం సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. పట్టణంలో ప్రధానంగా ఉన్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపడతామని చెప్పారు. చిన్నారులు, మహిళలపై వేధింపులు లేదా నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, ప్రజలు పోలీసు శాఖకు అన్ని విధాలా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పారిశుధ్య కార్మికులకు కొబ్బరి నూనె, సబ్బులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ



**నాయుడుపేట, పెన్ పవర్, జూలై 13 :** సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని 120 మంది పారిశుధ్య కార్మికులకు సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ శ్రీ తన క్యాంపు కార్యాలయంలో కొబ్బరి నూనె,సబ్బులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరంతరం శ్రమిస్తూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుధ్య కార్మికుల సేవలను అభినందించారు. పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించడంతోపాటు వారికి అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సుధాకర్ రెడ్డి,ఏఎంసి చైర్మన్ ఆకుతోట రమేష్,సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్,పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ధరలు లేక పొలంలోనే వదిలేస్తున్నారు

సింహాద్రిపురం : గిట్టుబాటు ధర లేక మండలంలోని గురజాల గ్రామంలో ఆదివారం పొలంలోనే కలింగర పంటను రైతు వదిలేశాడు. వివరాలు.. వరుణ్ రెడ్డి గురిజాలలో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని ఎకరాకు లక్ష రూపాయలతో ఐదు ఎకరాల్లో 75 రోజులకు దిగుబడి వచ్చే కలింగర పంటను సాగు చేశారు. దిగుబడి బాగా వచ్చిందని సంతోషపడ్డాడు. కేజీ తొమ్మిది రూపాయల చొప్పున 18 టన్నులు కాయలను కోశారు. కానీ రేటు పడిపోవడంతో కొనే నాథుడు లేడు. దీంతో విధి లేని పరిస్థితుల్లో పంటను వదిలేశారు. జనాలు కలింగర కాయలకు ఎగబడి కోసుకొని వెళ్లారు. ప్రజలకేమో సంతోషం.. రైతుకేమో దుఃఖం.. అప్పులు మిగిలాయి.

# రెండురోజుల్లో శ్రీధర్ మృతదేహం రాక

కడప అర్బన్ : వియత్నాం బోటు ప్రమాదంలో దుర్మరణం చెందిన కడప ప్రముఖ వ్యాపారవేత్త ముడియం శ్రీధర్ (50) భౌతికకాయం మరో రెండు రోజుల్లో కడపకు చేరుకోనుంది. ఈ మేరకు వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం, స్థానిక అధికారులు సమన్వయంతో స్వదేశానికి తరలించే అధికారిక దౌత్య ప్రక్రియలను ముమ్మరం చేశారు. ఆనందంగా గడపడానికి విదేశీ విహారయాత్రకు వెళ్లిన శ్రీధర్ ఊహించని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం కడప నగరాన్ని తీవ్ర శోకసముద్రంలో ముంచెత్తింది. శ్రీధర్‌తో పాటు అదే బోటులో ప్రయాణించి, అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడ్డ కడప ఎన్జీఓ కాలనీకి చెందిన నయీమ్ సోమవారం సాయంత్రానికే కడపకు చేరుకోనున్నారు. గత 2024 నవంబర్ 14న శ్రీధర్ సోదరుడు హరి అనారోగ్యంతో అకాల మరణం చెందారు. ఆ చేదు జ్ఞాపకం నుండి తేరుకోకముందే, కేవలం ఏడాదిన్నర వ్యవధిలోనే కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న శ్రీధర్ కూడా మరణించడంతో ఆయన తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు తీరని లోటు మిగిలింది. కడపలో సెల్‌ఫోన్‌ల వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించి దాదాపు 50 మందికి పైగా కార్మికులకు శ్రీధర్ జీవనోపాధి కల్పించారు. కొండంత అండగా నిలిచిన యజమాని ఆకస్మిక మరణంతో ఆయా కార్మిక కుటుంబాల ఉపాధి ప్రశ్నార్థకంగా మారింది. స్నేహశీలి అయిన శ్రీధర్ మృతి పట్ల కడప వ్యాపార వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశాయి.

# శ్రీవారి హుండీ ఆదాయం రూ. 1.07 కోట్లు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామికి భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకను సోమవారం లెక్కించారు. 57 రోజులకు గాను రూ. 1,07,23,498 నగదుతో పాటు 7 గ్రాముల బంగారు, 432 గ్రాముల వెండి, రెండు అమెరికా డాలర్లు, ఒక మలేషియా రూపే, అరబ్ దినార్లు వచ్చినట్లు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. గతంతో పోలిస్తే ఈసారి ఆదాయం పెరిగిందన్నారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో హుండీల పర్యవేక్షణ అధికారి ప్రసాద్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్, ఆలయ సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడే ఆఖరు 'సర్'

### ఇంకా పెండింగ్‌లో 20 వేల ఈఎఫ్‌ల డిజిటలైజేషన్

పుట్టపర్తి అర్బన్: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమం మంగళవారంతో ముగియనుంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా బీఎల్‌ఓలు ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు (ఈఎఫ్) పంపిణీ చేశారు. ఈఎఫ్‌ల డిజిటలైజేషన్ ప్రక్రియ కూడా వేగవంతం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం విధించిన గడువు మంగళవారంతో ముగియనుండగా...ఇంకా 20 వేల ఈఎఫ్‌ల డిజిటలైజేషన్ ప్రక్రియ పెండింగ్‌లోఉంది. ఒక్కరోజులోనే అన్ని ఈఎఫ్‌ల డిజిటలైజేషన్ సాధ్యమా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంకా చాలా మంది ఈఎఫ్‌లు పూర్తి చేసి ఇవ్వలేదు. వారంతా మంగళవారం నాటికి బీఎల్‌ఓలకు ఈఎఫ్‌లు అందజేయాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

**జిల్లాలో 98.62 శాతం పూర్తి :** జిల్లాలో 14,23,839 మంది ఓటర్లుండగా... 15 రోజుల్లో ఈఎఫ్ ఫారాలు అందజేసి తిరిగి తీసుకొని 14,04,152 ఈఎఫ్‌లు (98.62 శాతం) డిజిటలైజేషన్ పూర్తి చేశారు. అత్యధికంగా హిందూపురం నియోజక వర్గంలో 99.77 శాతం, పెనుకొండ నియోజక వర్గంలో 99.58 శాతం, కదిరిలో 99.13 శాతం, పుట్టపర్తి నియోజక వర్గంలో 98.28 శాతం, ధర్మవరంలో 97.66 శాతం, మడకశిరలో 97.01 శాతం పూర్తయినట్లు వెల్లడించారు. మంగళవారం చివరి రోజు కావడంతో ఇప్పటికీ సుమారు 19,687 ఈఎఫ్‌లు డిజిటలైజేషన్ కావాల్సి ఉంది. మంగళవారం అర్ధరాత్రితో గడువు ముగిసి పోతుంది. తర్వాత యాప్‌కూడా ఓపెన్ కాదని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

రేణిగుంట : రేణిగుంట--కడప ప్రధాన రహదారిలోని మామండూరు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. కేవీబీపురానికి చెందిన రాజా (19), వెంకటేష్ (19) ద్విచక్రవాహనంపై కోడూరు వైపు వెళుతుండగా లారీ ఢీకొంది. దీంతో ఇరువురూ అక్కడికక్కడే మరణించారు. రేణిగుంట పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్

చిత్తూరు కలెక్టరేట్ : 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 53 జారీ చేయడంపై ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ హర్షం వ్యక్తం చేశారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 అమలుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 1, 2004 కంటే ముందు విడుదలైన నోటిఫికేషన్లలో ఎంపికై , సీపీఎస్ అమల్లోకి వచ్చిన తర్వాత విధుల్లో చేరిన అర్హులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఒకే ఒక్క సారి ఓపీఎస్‌ను ఎంచుకునే అవకాశాన్ని ప్రభు త్వం కల్పించిందన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల సుదీర్ఘ కల సాకారమైందని తెలిపారు.

# వినాయకుడి సేవలో కేంద్ర ఎలక్షన్ కమిషన్ కార్యదర్శి

కాణిపాకం: కాణిపాకం శ్రీ స్వయంభు వరసిద్ధి వినాయకస్వామి వారిని కేంద్ర ఎలక్షన్ కమిష నర్ కార్యదర్శి నవీన్‌కుమార్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఈఓ పెంచలకిషోర్ ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించు కున్న నవీన్‌కుమార్‌కు వేద పండితులు ఆశీర్వచనం అందించగా.. ఈఓ శేషవస్త్రం, స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశా రు. దర్శనానంతరం దేవస్థానం అతిథి గృహానికి చేరుకున్న కేంద్ర ఎలక్షన్ కమిషన్ కార్యదర్శికు చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ సాదర స్వాగతం పలికారు. ఆయనకు పూలమొక్కను అందజేశారు. చిత్తూరు ఆర్డీవో శ్రీనివాస్, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

# రాయలసీమ బలిజలకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి

నగరి : గవర్నర్ కోటా ఎమ్మెల్సీలో రాయలసీమ బలిజలకు అవకాశం కల్పించాలని రాయలసీమ బలిజ సామాజిక వర్గానికి కేటాయించాలని జాతీయ కాపు సంఘం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం కాపు సంఘ కార్యాలయం వద్ద జాతీయ కాపు సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు ఎంవి.బాబు, ప్రచార కార్య దర్శి గోపీరాయల్, సీనియర్ నాయకుడు జ్యోతి నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సంఘ నేతలు తమ డిమాండ్‌ను కూటమి ప్రభుత్వం ముందు ఉంచారు. గవర్నర్ కోటాలో ఈ నెలాఖరుకు ఖాళీ కానున్న రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒక స్థానా న్ని రాయలసీమ బలిజ సామాజిక వర్గానికి కేటాయించాలన్నారు. సమావేశంలో కాపునాయకులు శేఖర్, వాసు, గోపి, సౌందర్‌రాజన్, అయ్య ప్ప, కదిర్‌వేలు, మణి పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతి

పుత్తూరు: స్థానిక పున్నమి సర్కిల్ సమీపంలోని మహాలక్ష్మీపురం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియన వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ బి.వెంకటలక్ష్మి కథనం.. సుమారు 45 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి మహాలక్ష్మీపురం వద్ద రోడ్డు దాటుతుండగా తిరుపతి నుంచి చైన్నె వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి ఒంటిపై తెలుపు,నలుపు గీత ల గళ్లు కలిగిన ఫుల్ షర్టు, బిస్కెట్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. కుడి చేతిపై చంద్రశేఖర్ అని పచ్చబొట్టు ఉంది. ఈ మేరకు పుత్తూరు పో లీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కట్టుకున్న భార్యను శారీరకంగా, మానసికంగా వేధించిన కేసులో ముద్దాయి వై.సీమాన్ సుదర్శన్‌కు ఏడాది జైలుశిక్ష,

చిత్తూరు అర్బన్: కట్టుకున్న భార్యను శారీరకంగా, మానసికంగా వేధించిన కేసులో ముద్దాయి వై.సీమాన్ సుదర్శన్‌కు ఏడాది జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ చిత్తూరులోని మూడో అద నపు జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయ స్థానం సోమవారం తీర్పునిచ్చింది. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వాతి కథనం మేరకు.. చిత్తూరు నగరం భరత్‌నగర్ కాలనీకి చెందిన మౌనిక అనే మహిళకు, తమిళనాడు రాష్ట్రం కడలూరుకు చెందిన వై.సీమాన్ సుదర్శన్‌తో పెళ్లయ్యింది. అయితే పెళ్లయ్యిన కొద్ది నెలలకే తన భర్తతో పాటు అతని కుటుంబ సభ్యులు తనను మానసికంగా, శారీరకంగా వేధించడంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డారని 2020లో చిత్తూరులోని మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశా రు. దీనిపై ఎస్ఐ కె.నిత్యానంద పిళ్లై కేసు నమోదుచేసి, దర్యాప్తు పూర్తి చేసి న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు. సుదర్శన్‌పై సాక్ష్యాధా రాలతో సహా కోర్టులో కేసు రుజువయ్యింది. మిగిలిన వాళ్లపై న్యాయస్థానం కేసు కొట్టేసింది. ముద్దాయికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఏఎస్ఐ పరంధామనాయుడు, మహిళా ఎస్ఐ కరీమున్నిసా, అప్పటి ఎస్ఐ నిత్యానంద పిళ్లైని ఎస్పీ అభినందించారు.

# వివాహిత ఆత్మహత్య - భర్తపై కేసు నమోదు

తిరుపతి క్రైమ్ : భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పీకే లేఔట్‌లో జరిగింది.ఈ మేరకు భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఈస్ట్ సీఐ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. వివరాలు.. అన్నమయ్య జిల్లా రామాపురం మండలం ఓబులరెడ్డిగారిపల్లెకు చెందిన ఎం.వెంకటరమణ కుమార్తె శాంతి అలియాస్ విజయశాంతికి, శ్రీకాళహస్తి సమీపంలోని పవన్‌నగారి కండ్రిగ గ్రామానికి చెందిన ఏ.కార్తీక్‌తో 2025 ఆగస్టు 18న పెద్దల సమక్షంలో రెండో వివాహం జరిగింది. కార్తీక్ రేణిగుంటలోని చదలవాడ డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. వివాహానంతరం దంపతులు తిరుపతిలోని పీకే లేఔట్‌లో నివాసం ఉంటున్నారు. సంతానం కలగకపోవడంతో రెండు నెలలుగా వైద్య చికిత్సల కోసం సుమారు రూ.1.75 లక్షలు ఖర్చు చేశారు. అయినప్పటికీ పిల్లలు కలగలేదని కార్తీక్ తరచూ భార్యను అవమానించేవాడు. పిల్లలను కనలేనప్పుడు ఎందుకు ఉండడం.. చచ్చిపో అంటూ మానసికంగా వేధించేవాడు. దీంతో మనస్తాపానికి గురైన విజయశాంతి ఆదివారం రాత్రి తమ ఇంట్లోని బెడ్‌రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుంది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త కార్తీక్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి శ్రీ వేంకటేశ్వర మెడికల్ కళాశాల మార్చురీకి తరలించామని సీఐ వెల్లడించారు.

## ఎర్రచందనం కేసులో ముగ్గురికి జైలు

తిరుపతి లీగల్ : ఎర్రచందనం దుంగల అక్రమ రవాణా కేసులో ముగ్గురికి ఐదేళ్ల చొప్పున జైలు శిక్ష, రూ.3లక్షల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ జడ్జి నరసింహమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. భాకరాపేట సీఐ సత్యనారాయణ, కోర్టు లైజనింగ్ అధికారి హరినాథ్, కోర్టు కానిస్టేబుల్ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. 2017లో భాకరాపేట వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. రేణిగుంట మండలం, వెంకటాపురం పంచాయతీ, అనాసంపల్లెకు చెందిన జి.పుట్టాలయ్య, చిన్నగొట్టిగల్లు మండలం, నెల్లుట్లవారిపల్లెపాళం ఎస్టీ కాలనీకి చెందిన పెట్లూరి రాజయ్య, గడ్డంవారి మణికంఠ ఎర్రచందనం దుంగలను తరలిస్తూ పట్టుబడ్డారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ముగ్గురికీ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

# గంజాయి విక్రేత అరెస్ట్

శ్రీకాళహస్తి రూరల్ : గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. రూరల్ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం సాయంత్రం ఊరందూరు, పంగూరు రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. బీహార్‌లోని నలంద జిల్లా, బసోడి గ్రామానికి చెందిన జితేందర్ కుమార్ (22) గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి 2.7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఇబ్రహీం తెలిపారు.

# శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని 31 కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరుకుంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 90,130 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 38,075 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.24 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారు స్వామిని దర్శించుకోవడానికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారు 3 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టంచేసింది.

# టీటీడీకి రూ.4.41 కోట్ల విరాళం

తిరుమల : హైదరాబాద్‌కు చెందిన ఆర్ఎస్ బ్రదర్స్ రిటైల్ ఇండియా లిమిటెడ్ సంస్థ సోమవారం టీటీడీ బర్డ్ ట్రస్టుకు రూ.4.41 కోట్ల విరాళం అందించింది. సంస్థ చైర్మన్ పొట్టి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు ఎస్.రాజమౌళి, టి.ప్రసాదరావు, పొట్టి మాలతి లక్ష్మీకుమారి ఈ మేరకు రంగనాయకుల మండపంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈఓ వెంకయ్య చౌదరికి డీడీలు అందజేశారు.

# ప్రాణాదాన ట్రస్ట్‌కు రూ.10 లక్షలు

తిరుపతికి చెందిన డాక్టర్ సింగపాటి సుబ్బారావు తన కుమారుడు సింగపాటి సాయికృష్ణ పేరిట ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం అందించారు. తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడుకు డీడీని అందజేశారు.

# పోలీస్ 'గ్రీవెన్స్'కు 66 వినతులు

తిరుపతి క్రైమ్ : జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు 66 వినతులు వచ్చినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. అర్జీలను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.

# 17న శ్రీసిటీలో జాబ్ మేళా

వరదయ్యపాళెం: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శ్రీసిటీలో ఈ నెల 17వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు సోమవారం ఈ మేరకు కలెక్టరేట్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. ఉదయం 8 గంటల నుంచి శ్రీ సిటీలోని ఫైర్ స్టేషన్ వెనుక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో మేళా జరుగుతుందని అధికారులు వెల్లడించారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ శ్రీసిటీలోని 14 బహుళజాతి కంపెనీలు ఈ మేళాలో పాల్గొని 500కు పైగా పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని వెల్లడించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం మాట్లాడుతూ, 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైన 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు యువతీయువకులు జాబ్‌మేళాకు రావచ్చని వివరించారు. ఆసక్తిగలవారు హెచ్‌టీటీపీఎస్://నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్/ వెబ్ సైట్‌లో 16వ తేదీలోపు నమోదు చేసుకోవాలని సూచించారు. అయితే స్పాట్ రిజిస్ట్రేషన్ సౌకర్యం కూడా ఉంటుందని వెల్లడించారు. ఇతర వివరాలకు 9440374535, 9121646661, 9988853335 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు. సోషల్ వెల్ఫేర్ డీడీ హరీష్, సీఆర్ఓ పి.మురళీకృష్ణ, ఎన్‌టీఓ సురేష్ బాబు, ప్లేస్‌మెంట్ అధికారి సులేమాన్‌బాషా పాల్గొన్నారు.

# డీఐఈఓగా గోపాల్‌రెడ్డి

తిరుపతి సిటీ : ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖాధికారిగా పుత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గోపాల్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ మేరకు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆయన బాధ్యతలు చేపట్టారు. త్వరలో ఆర్‌ఐఓగాను ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలుస్తోంది.

# వ్యవసాయమే ఆధారం.. సార్

**ఉయ్యాలవాడలో ఎస్పీ పర్యటన**
**గ్రామస్తులతో కాసేపు మాటామంతి**

ఉయ్యాలవాడ: 'సార్ మా మండలంలో ఎలాంటి పరిశ్రమలు లేవు. ప్రతి ఒక్కరూ వ్యవసాయంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నాం. ఈ ఏడాది ఇంత వరకు పంటలు సాగు చేసేందుకు వానలు కురవలేదు' అంటూ ఉయ్యాలవాడ ప్రజలు జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్‌తో అన్నారు. సోమవారం ఉయ్యాలవాడను ఎస్పీ సందర్శించారు. గ్రామస్తులతో కాసేపు సరదాగా మాట్లాడుతూ వారి జీవన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. స్థానిక వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం సమీపంలో వున్న రచ్చబండపై కాలక్షేపానికి గ్రామస్తులు ఆడుతున్న పులిగీతం ఆటను చూసి.. ఆటను ఎలా ఆడాలంటూ వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలియుగ దానకర్ణుడు బుడ్డా వెంగళరెడ్డి వంశీయులు బుడ్డా విశ్వనాథరెడ్డి స్వగృహానికి వెళ్లారు. వెంగళరెడ్డి జీవిత విశేషాలను తెలుసుకున్నారు. ఆయనకు విక్టోరియా మహారాణి అందజేసిన బంగారు పతకాన్ని సందర్శించి, ఆ పతకం ఇవ్వడానికి కారణాలను తెలుసుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ పై కప్పు నుంచి ఇనుప చువ్వలు బయట పడివుడడంపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. గ్రామస్తులు కక్షలకు దూరంగా ఉండి ప్రశాంతంగా జీవించాలని ఎస్పీ సూచించారు. ఆయన వెంట ఆళ్లగడ్డ డీఎస్పీ శ్రీనివాసులు, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ ఎస్ఐలు మల్లికార్జునరెడ్డి, రామిరెడ్డి, ఏఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# పాత్రికేయులపై దాడిని సహించం : ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : పాత్రికేయులపై టీడీపీ నేతలు గూండాల మాదిరిగా దాడికి పాల్పడడం దుర్మార్గమని, ప్రజాస్వామ్యవాదులుగా ఇలాంటి సహించే ప్రసక్తే లేదని ఎంపీ గురుమూర్తి మండిపడ్డారు. సోమవారం తిరుపతిలోని ఓ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమ కవరేజీకి వెళ్లిన జర్నలిస్టులపై మంత్రుల సమక్షంలోనే పచ్చమూక దాడి చేశారనే వార్త ఆందోళన కలిగించిందన్నారు. చంద్రబాబు ప్రభు త్వం వచ్చినప్పటి నుంచి జర్నలిస్టులపై దాడులు, అక్రమ కేసులు నమోదు చేయడం సర్వసాధారణంగా మారిందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్య త ప్రభుత్వంపై ఉందని, కానీ, పాత్రికేయుల భద్రతకే భంగం కలిగే పరిస్థితులు తలెత్తడం దురదృష్టకరమన్నారు. పాత్రికేయులపై దాడికి పాల్పడిన నిందితులపై నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# నేడు టీటీడీ బోర్డు సమావేశం

తిరుమల : తిరుమలలోని అన్నమయ్య భవనంలో టీటీడీ పాలకమండలి సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన చేపట్టనున్న సమావేశంలో మొత్తం 62 అజెండా అంశాలపై చర్చించనున్నారు. భక్తులకు మెరుగైన వసతుల కల్పన, ఆలయాల అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం, ధార్మిక కార్యక్రమాల బలోపేతానికి సంబంధించిన అంశాలపై నిర్ణయాలు తీసుకునే అవకాశముందని టీటీడీ అధికారులు వెల్లడిస్తున్నారు.

# తాడికొండ గురుకులంలో విద్యార్థుల గెంటివేత

**తాడికొండలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు**
**టీసీలు తీసుకుని వేరే హాస్టళ్లకు వెళ్లాలంటూ తల్లిదండ్రులకు ఫోన్లు ఆపై రాస్తారోకో**

ఎంట్రన్స్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఏపీ గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించిన 480 మంది పేద విద్యార్థుల పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది. తాడికొండ ఏపీ గురుకుల సెంటర్‌తో పా టు, విశాఖ జిల్లా మేదాద్రి గడ్డ, తిరుపతి జిల్లా కోట ప్రాంతాల్లోని గురుకులాలను ఎక్సలెన్స్ సెంటర్లుగా మారుస్తూ ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. ఈ సెంటర్లలో ప్రస్తుతం ఉన్న విద్యార్థులను వేరే గురుకులాలకు తరలించి ఇక్కడ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పేరుతో ఇంటర్‌తో పాటు, జేఈఈ, నీట్‌కు శిక్షణ ఇచ్చేలా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా 'మీ పిల్లలను ఇక్కడ నుంచి వేరే ప్రాంతానికి బదిలీ చేస్తున్నాం.. వచ్చి తీసుకెళ్లండి'.. అంటూ మేసేజ్‌లు పంపడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. తాడికొండ గురుకుల పాఠశాల వద్దకు చేరుకుని ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌ను నిలదీయడంతో పాటు.. రాస్తారోకో నిర్వహించారు. తమ పిల్లలను ఇక్కడ చదివించాలని డిమాండ్ చేశారు. పోలీసులు అక్కడకు చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులకు నచ్చజెప్పి.. రాస్తారోకో విరమింపజేశారు.

# 'మార్కెట్' పాలక వర్గాల పదవీ కాలం పొడిగింపు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లాలోని రెండు వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలక వర్గాల పదవీ కాలాన్ని ఆరు నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, నంద్యాల జిల్లా పాణ్యం వ్యవసాయ మార్కెట్ కమిటీల పదవీ కాలాన్ని మొదటి దఫా ఆరు నెలలు పొడిగిస్తూ వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.

# శతాధిక వృద్ధురాలి మృతి

ఎమ్మిగనూరుసెంట్రల్: ఎమ్మిగనూరు మండలం మల్కాపురం గ్రామంలో శతాధిక వృద్ధురాలు కురువ హనుమంతమ్మ(106) సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈమెకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. నెల క్రితం వరకు తన పనులు తాను చేసుకుంటూ ఆరోగ్యంగా ఉన్న ఈమెకు ఇటీవల వృద్ధాప్య సమస్యలు వెంటాడాయి. బీపీ, షుగర్ వంటి లక్షణాలు లేవని, అందరినీ ఎంతో ఆప్యాయంగా పలికించేవారని గ్రామస్తులు తెలిపారు. వైద్యులు డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, ఇతర రాజకీయ ప్రముఖులు హనుమంతమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్లేగు సంభవించడం, తుంగభద్ర దిగువ కాలువ పనుల ప్రారంభం వంటివి హనుమంతమ్మకు గుర్తు ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు.

# అప్పుల బాధతో అస్వస్థతకు గురై రైతు మృతి

బండిఆత్మకూరు: అప్పుల భారం ఓ రైతు ప్రాణం తీసింది. పరమటూరు గ్రామానికి చెందిన పిక్కిలి శివరాజు (43) గతేడాది తనకున్న ఏడెకరాల పొలంతో పాటు, మరో 20 ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప, పొగాకు పంటలు సాగు చేశాడు. ఆశించిన మేర పంట దిగుబడి రాకపోవడం, వచ్చిన పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించకపోవడంతో తీవ్రంగా నష్టపోయాడు. దీంతో అప్పుల భారంతో మనోవేదనకు గురై పది రోజుల క్రితం అనారోగ్యం పాలు కావడంతో ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి అస్వస్థతకు గురై గుండె పోటు రావడంతో చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబీకులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. శివరాజు మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడికి భార్య పద్మావతి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రైతు కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

# జెడ్పీ సీఈఓగా సుధాకర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ సీఈఓగా ఆర్.సుధాకర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ రెగ్యులర్ సీఈఓగా విధు లు నిర్వహించిన జీవీ రమణారెడ్డి గత జూన్ 30న పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి సీఈఓగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 11న సెర్ఫ్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్.సుధాకర్ రెడ్డిని జెడ్పీ సీఈఓగా నియమిస్తూ పీఆర్ అండ్ ఆర్డీ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కాంతిలాల్ దండె ఉత్త ర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే సోమ వారం ఆయన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరిని, జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డిని గౌరవపూర్వకంగా కలసి బాధ్యతలు స్వీకరించారు.

# నిలిచిపోయిన ఏఎన్ఎంల పదోన్నతులు

### పదోన్నతులకు గైడ్‌లైన్స్ రాలేదు

### ఇతర జిల్లాల్లో అమలు - కర్నూలులో నిరీక్షణ

కర్నూలు(హాస్పిటల్): గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎన్ఎంఎంలకు పదోన్నతుల ప్రక్రియ ఇతర జిల్లాల్లో కొనసాగుతున్నా కర్నూలు జిల్లాలో చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో హెల్త్ కార్యదర్శులు(ఏఎన్ఎం)లు కీలక పాత్ర పోషిస్తున్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించారు. అయితే పదోన్నతుల విషయంలో మాత్రం వీరికి అన్యాయం జరుగుతోంది. జిల్లాలో గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో 1,008 మందికి హెల్త్ కార్యదర్శులుగా ఉద్యోగాలు కల్పించారు. వీరి సీనియారిటీ మేరకు గత సంవత్సరం 175 మందికి పదోన్నతులు కల్పించారు. ప్రస్తుతం 833 మంది సచివాలయ ఏఎన్ఎంలుగా విధులు నిర్వహిస్తున్నారు. సీనియారిటీ ప్రకారం అర్హులైన వారందరికీ పదోన్నతులు కల్పించాలని వారు కోరుతున్నారు.

**జిల్లాలో అమలుకాని ఉత్తర్వులు :** రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతులపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిన తర్వాత అనేక జిల్లాల్లో అర్హులైన హెల్త్ కార్యదర్శులు(ఏఎన్ఎం)లకు పదోన్నతులు కల్పించారు. కానీ కర్నూలు జిల్లాలో మాత్రం ఫైళ్లు ముందుకు సాగకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇతర జిల్లాల్లో తమతో పాటు పనిచేసిన సహోద్యోగులు పదోన్నతులు పొంది కొత్త బాధ్యతలు స్వీకరిస్తుంటే తాము మాత్రం అదే స్థాయిలో కొనసాగాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం :** ఈ అంశంపై ఇప్పటికే ఏఎన్ఎంలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. పదోన్నతుల ప్రక్రియ ఎందుకు నిలిచిపోయిందని ఆ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. ఆ శాఖలోని కొందరు అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపిస్తున్నారు. ఈ నెల 14తో అన్ని రకాల పదోన్నతులు ఫ్రీజ్ అవుతున్నాయని, ఏఎన్ఎంల పదోన్నతుల ప్రక్రియకు గడువు పొడిగించి పూర్తి చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. లేనిపక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తమ ఆవేదన వినిపిస్తున్నారు.

ఇతర జిల్లాల్లో ఏఎన్ఎంల పదోన్నతుల ప్రక్రియ చేస్తున్నారని, ఇక్కడ కూడా చేయాలంటే కుదరదు. ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి గైడ్‌లైన్స్ రాలేదు. సచివాలయ ఏఎన్ఎంలకు నవంబర్, డిసెంబర్‌లలో పదోన్నతుల ప్రక్రియ జరుగుతుంది. అప్పుడు కాదు, ఇప్పుడే చేయాలంటే ఎలా?. -- డాక్టర్ ఎల్.భాస్కర్, ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ, కర్నూలు

## సంక్షేమంలో కారుణ్య నియామకం

కర్నూలు(అర్బన్): సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని వసతిగృహాల్లో కారుణ్య నియామకం కింద ఒక మహిళకు ఉద్యోగాన్ని కల్పిస్తూ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని జొన్నగిరి సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న మాదిగ నాగరాజు ఈ ఏడాది ఫిబ్రవరి 21న ప్రమాదవశాత్తూ మృతిచెందారు. ఈ నేపథ్యంలో కారుణ్య నియామకం కింద మృతుడు నాగరాజు సతీమణి ఎం.సువేదకు పత్తికొండ బాలికల వసతి గృహంలో వంట మనిషిగా ఉద్యోగాన్ని కల్పించారు. ఈ మేరకు సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారిణి బి.రాధిక నియామకపు ఉత్తర్వులను సువేదకు అందించారు. కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ సహాయకులు గద్ద రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డీఎల్‌డీ ప్రవేశాలకు నేటి నుంచి వెబ్ ఆప్షన్స్

కర్నూలు సిటీ: ప్రభుత్వ, ప్రైవేట్ డీఎల్‌డీ కాలేజీల్లో ప్రవేశాలకు నేటి(మంగళవారం)నుంచి 18వ తేదీలోపు వెబ్ ఆధారిత ఆప్షన్స్ ఇవ్వాలని ప్రభుత్వ డీఎల్‌డీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆయూబ్ హుసేన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ డిప్లొమా ఇన్--ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. వెబ్ ఆప్షన్ల ఆధారంగా ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు సీట్ల కేటాయింపు చేస్తారని తెలిపారు. వీరంతా 24 నుంచి 29వ తేదీ వరకు ప్రభుత్వ డైట్ కాలేజీలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను సమర్పించాలని పేర్కొన్నారు.

## చెక్‌బౌన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్

కర్నూలు: ఉమ్మడి కర్నూలు జిల్లా కోర్టుల ప్రాంగణాల్లో ఈనెల 18న చెక్‌బౌన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ప్రజలకు సత్వర న్యాయం అందించాలనే లక్ష్యంతో 2026 జులై 18న కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని అన్ని న్యాయస్థానాల్లో పెండింగ్ చెక్‌బౌన్స్ కేసులు మాత్రమే పరిష్కరించుకోవడానికి ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు, బ్యాంకు, ఫైనాన్స్ అధికారులు, న్యాయవాదులు ఉపయోగించుకుని తమ చెక్‌బౌన్స్ కేసులను రాజీపూర్వకంగా పరిష్కరించుకోవాలని కోరారు.

## 25 మంది కానిస్టేబుళ్లకు హెచ్‌సీలుగా పదోన్నతి

కర్నూలు: ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సై ?సజ్ శాఖలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 25 మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆ శాఖ జిల్లా నోడల్ అధికారి ఎం.సుధీర్ బాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన వారికి ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతాల నుంచి మరో ప్రాంతానికి స్థానచలనం కల్పించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 ఎక్సై ?సజ్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. స్టేషన్లతో పాటు ఐఎంఎల్ డిపో, టాస్క్‌ఫోర్స్, డీసీఆర్, చెక్‌పోస్టులు తదితర ప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి పదోన్నతి కల్పించి ఆయా స్థానాల నుంచి బదిలీ చేశారు. బదిలీల్లో భాగంగా కేటాయించిన స్థానాల్లో వెంటనే చేరిపోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## తుంగభద్ర నీరు తాగేందుకే.. పంటలకు కాదు!

### పోలీసుల సహకారంతో నీటి చౌర్యాన్ని అడ్డుకోవాలి

కర్నూలు(సెంట్రల్): జూలై 16వ తేదీన తుంగభద్ర డ్యామ్‌నుంచి విడుదలయ్యే 1.5 టీఎంసీల నీటిని తాగడానికి ప్రాధాన్యం ఇవ్వాలని..ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షాలు ఉండడంతో పంటలకు ఇవ్వలేమని కలెక్టర్ డాక్టర్ ఏ సిరి తేల్చి చెప్పారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఇరిగేషన్, ఇతర శాఖల అధికారులతోకలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తుంగభద్ర నుంచి విడులైన నీటితో ఎస్ఎస్ ట్యాంకులను నింపడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ట్యాంకుల నుంచి నేరుగా నీటిని పంట పొలాలకు తీసుకెళ్లడం కుదరదని, నీటి చౌర్యాన్ని అడ్డుకోవడానికి పోలీసు సాయం తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. అనావృష్టి కారణంగా ఈసారి పంట దిగుబడి వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయని, రైతులు నష్టపోకుండా ఉండేందుకు పంటల బీమాను వినియోగించుకోవాలని, జూలై 15లోపు పత్తి, వేరుశనగ పంటలకు బీమా ప్రీమియం చెల్లించాలని రైతులకు సూచించారు. టెలీకాన్ఫరెన్స్‌లో జేసీ నూరుల్ ఖమర్, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మీ, ఎల్‌డీఎం పి.మోహన్ పాల్గొన్నారు.

## భర్తను కడతేర్చిన భార్య

### కుమార్తెలు, అల్లుడితో కలిసి దాడిచేసి హత్య

పత్తికొండ రూరల్: కుటుంబ కలహాల కారణంగా భర్తను తన కుమార్తెలు, అల్లుడితో కలిసి భార్య కడతేర్చారు. ఈ ఘటన సోమవారం హోసూరు గ్రామంలో వెలుగుచూసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పత్తికొండ మండల పరిధిలోని హోసూరు గ్రామానికి చెందిన మేకల శ్రీనివాస్(51)కు భార్య సునీత, ఇద్దరు కుమార్తెలు నీలావతి, సుజాత, అల్లుడు రాజశేఖర్ ఉన్నారు. కుటుంబ విభేదాలతో భార్యాభర్తలు వేర్వేరు ఇళ్లలో నివశిస్తున్నారు. సునీతతో కలిసి కుమార్తెలు ఉంటున్నారు. శ్రీనివాస్ తన సొంతింట్లో ఉంటున్నారు. భార్యాభర్తల మధ్య ఆస్తి పంపకాలు, గొడవలకు సంబంధించి వివాదం ముదిరిపోయింది. దీంతో భార్య సునీత, కుమార్తె, అల్లుడి సాయంతో హత్యకు పథకం వేశారు. రాత్రి సమయంలో మేకల శ్రీనివాస్ ఇంటికి వెళ్లారు. రాడ్లు, కట్టెలు, కర్రలతో దాడి చేసి చంపేశారు. కాళ్లు, చేతులు విరిగి రక్తస్రావమై మేకల శ్రీనివాస్ మృతదేహాన్ని గమనించిన గ్రామస్తులు సోమవారం ఉదయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న వెంటనే డీఎస్పీ వెంకట్రామయ్య, సీఐ జయన్న గ్రామానికి చేరుకుని హత్యపై విచారణ చేపట్టారు. నలుగురిపైన హత్య కేసు నమోదు చేసినట్లు సీఐ జయన్న తెలిపారు.

## ఓటర్లకు బీఎల్‌ఓలు అందుబాటులో ఉండాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

కర్నూలు(సెంట్రల్): ఓట్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియకు సోమ, మంగళవారాలే సమయం ఉండడంతో పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు బీఎల్‌ఓలు అందుబాటులో ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆదేశించారు. సోమవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో మాట్లాడారు. మిగిలిన పోయిన ఓటర్ల వివరాలను పోలింగ్ కేంద్రాల్లోనే సమర్పించేలా బీఎల్‌ఏలు చర్యలు తీసుకోవాలన్నారు. మరణించిన(డెత్), డూప్లికేట్ ఓటర్లకు సంబంధించి తగిన ఆధారాలు/సర్టిఫికెట్లు/ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయోలేదో పరిశీలించుకోవాలన్నారు. అబెసెంట్, సిఫ్టెడ్ ఓటర్ల వివరాల సేకరణను కూడా నిశితంగా పరిశీలించాలన్నారు. ఏఎస్‌డీడీ ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాలను ఈఆర్‌ఓలు తనిఖీలు చేయాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో జేసీ నూరుల్ ఖమర్, కర్నూలు ఈఆర్‌ఓ చల్లా ఓబులేసు, ఆదోని, ఎమ్మిగనూరు ఈఆర్‌ఓలు మధుసూదన్‌రెడ్డి, కోడుమూరు ఈఆర్‌ఓ సందీప్‌కుమార్, పత్తికొండ ఈఆర్‌ఓ ఓబులేసు, మంత్రాలయం ఈఆర్‌ఓ అనురాధ, ఆలూరు ఈఆర్వో రామసుబ్బయ్య పాల్గొన్నారు.

**కర్నూలులో పోలింగ్ కేంద్రాల తనిఖీ :** కర్నూలు నియోజకవర్గంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను కలెక్టర్ డాక్టర్ ఏ సిరి పరిశీలించారు. నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో, చిదంబరంవీధిలోని వివేకానంద బాల విద్యా మందిర్‌లో పోలింగ్ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఏఎస్‌డీడీ జాబితాల తయారీ, అన్‌కలెక్టబుల్ ఓట్ల వివరాలను సమగ్రంగా సేకరించాలని ఈఆర్‌ఓ చల్లా ఓబులేసును ఆదేశించారు.

## టీటీడీకి హైదరాబాద్ కు చెందిన ఆర్ఎస్ బ్రదర్స్ రూ.4.41 కోట్ల విరాళం

తిరుమల : హైదరాబాద్‌కు చెందిన ఆర్ఎస్ బ్రదర్స్ రీటైల్ ఇండియా లిమిటెడ్ సంస్థ సోమవారం టీటీడీ బర్డ్ ట్రస్టుకు రూ.4.41 కోట్లు విరాళంగా అందించింది. ఈ మేరకు ఆ సంస్థ చైర్మన్ పొట్టి వేంకటేశ్వర్లు, డైరెక్టర్లు ఎస్.రాజమౌళి, టి.ప్రసాదరావు, పొట్టి మాలతి లక్ష్మీ కుమారి శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీలను అందజేశారు. అదేవిధంగా తిరుపతికి చెందిన శ్వాసకోశ వైద్యుడు డాక్టర్ సింగపాటి సుబ్బారావు తన కుమారుడు సింగపాటి సాయికృష్ణ పేరుమీదుగా శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించారు.

**టీటీడీ ఎస్వీ గోశాలకు మగ గుర్రం విరాళం :** మదురైకు చెందిన భక్తుడు వడివేలు ముగంధన్ సోమవారం టీటీడీ ఎస్వీ గోశాలకు ఒక మగ గుర్రాన్ని విరాళంగా అందజేశారు. ఈ గుర్రానికి అవసరమైన శిక్షణ పూర్తి చేసిన అనంతరం, శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి సేవలో వినియోగించనున్నారు. దాత ఈ గుర్రాన్ని టీటీడీ ఎస్వీ గోశాల డైరెక్టర్ ఏ.వి.ఎన్. శివకుమార్‌కు అప్పగించారు. తాజాగా ఎస్వీ గోశాలలో విరాళం ఇచ్చిన గుర్రంతో కలుపుకుని 5 గుర్రాలు ఉన్నట్లు గోశాల డైరెక్టర్ వెల్లడించారు.

## శ్రీవారి ఆలయంలో రెండు రోజుల పాటు వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల : తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల17న ఆణివారా ఆస్థానం సందర్భంగా 14న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు వివరించారు. ఈ సందర్భంగాప్రోటోకాల్ ప్రముఖులకు మినహా ఇతరులకు ఈ రెండు రోజుల పాటు వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో జూలై 13, 16వ తేదిల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించిన సిఫార్సు లేఖలు స్వీకరించబడవని తెలిపారు. జూలై 17న కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవలను రద్దు చేసామని పేర్కొన్నారు. తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కంపార్టుమెంట్లు నిండి శిలాతోరణం వరకు క్యూలైన్‌లో నిలబడ్డారు.టోకెన్లు లేని భక్తులకు 20 గంటల్లో సర్వదర్శనం అవుతుందని వివరించారు.ఆదివారం స్వామివారిని 90,130 మంది భక్తులు దర్శించుకోగా 38,075 మంది తలనీలాలు సమర్పించుకున్నారు.భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల హుండీకి రూ. 4.13 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

## ఏనుగులనూ వదలని స్మగ్లర్లు

రెండ్రోజుల క్రితం తమిళనాడులోని కేవీకుప్పం సమీపంలో ఆరుంబాక్కం వద్ద ఓ మామిడి తోటలో రెండు ఏనుగు దంతాలను దాచి ఉంచినట్లు సమాచారం అందుకున్న కాట్పాడి రేంజ్ అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణలో ఆంధ్ర ప్రాంతం నుంచి తీసుకొచ్చినట్లు నిందితులు చెప్పారని అధికారులు పేర్కొన్నారు. తమిళనాడులో ఏనుగు దంతాలతో పట్టుబడిన వారిలో జయరాజ్ అనే వ్యక్తి బంగారుపాళ్యం మండలం వెలుతురుచేనుకు చెందిన వ్యక్తి. ఈయన పలుమార్లు వన్యప్రాణుల వేట కేసుల్లో అరెస్టయ్యాడు. గతంలో యాదమరి మండలం తాళ్లమడుగు అటవీ ప్రాంతంలో విద్యుత్తు ఉచ్చుతో చిరుతను వేటాడి, కాలి గోళ్లను కత్తిరించి తీసుకెళ్లిన కేసులోను ముద్దాయిగా ఉన్నాడు.

## ఆదుకున్న హంద్రీ-నీవా..!

### చెరువుల్లో నీటి నిల్వలతో భూగర్భ జలాల వృద్ధి

### వర్షాభావంలోనూ పశ్చిమ మండలాల్లో పంటల సాగు

శాంతిపురం మండలం తుమ్మిశి పెద్ద చెరువు ఇది. ఐదు నెలల కిందట చెరువులో 'హంద్రీ-నీవా' జలాలను నిల్వ చేయడం వల్ల భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. దీర్ఘకాలంగా ఎండిన బోర్లలో నీటి వసతి సాకారమైంది. దాదాపు 30 గ్రామాలకు తాగునీటి ఇబ్బంది తొలగింది. వేలాది ఎకరాలకు సాగునీటి సమస్య తీరింది. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల్లోనూ.. చెరువులో నీటి నిల్వ వల్ల సాగు.. తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేదని జనం అంటున్నారు.

కుప్పం, న్యూస్‌టుడే: జిల్లాలోని కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో రైతులు బోర్లపైనే ఆధారపడి వ్యవసాయం సాగిస్తున్నారు. ఏటా వర్షాభావం వల్ల బోర్లలో నీటి మట్టం గణనీయంగా తగ్గింది. వెయ్యి అడుగుల లోతు కలిగిన బోర్లలోనూ నీటి లభ్యత కనీస స్థాయికి పడిపోయింది. పశ్చిమ ప్రాంతాన్ని వెంటాడుతున్న నీటి కరువుకు శాశ్వత పరిష్కారంగా కూటమి ప్రభుత్వం హంద్రీ-నీవా జలాలను తీసుకొచ్చింది. గతేడాది ఆగస్టులో కుప్పం బ్రాంచి కాలువలో నీటిని విడుదల చేశారు. దాదాపు ఆరు నెలల పాటు కాలువలో నీటి ప్రవాహం కొనసాగింది.

తీరిన తాగు,సాగు నీటి ఇబ్బందులు : గడిచిన నెల రోజులుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. వర్షాధార భూములు చాలా వరకు బీళ్లుబారాయి. సాగునీటి ఆధారిత భూముల్లో చక్కటి పంటల సాగు కొనసాగుతోంది. చెరువుల్లో హంద్రీ-నీవా జలాలను నిల్వ చేయడం ఫలితంగానే ప్రస్తుత దుర్భిక్ష పరిస్థితుల్లోనూ సేద్యపు బోర్లలో నీటి వసతి కొనసాగింపు వల్ల సాగు భూముల్లో పచ్చదనం అలవరచుకొందని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ రక్షిత మంచినీటి పథకాల బోర్లలోనూ నీటి వసతి వల్ల చాలా వరకు తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేదని అధికారులు చెబుతున్నారు.

జలకళ : పెద్దపంజాణి మండలంలో ప్రారంభమయ్యే కుప్పం బ్రాంచి కాలువ ద్వారా కుప్పం మండలంలోని పరమసముద్రం వరకు చెరువుల్లో నీటి వసతికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. రామకుప్పం, శాంతిపురం, గుడుపల్లె, కుప్పం మండలాల్లో దాదాపు 70 చెరువులతో పాటు వి.కోట, బైరెడ్డిపల్లె, పెద్దపంజాణి పరిధిలోని 30 చెరువుల్లో హంద్రీ-నీవా జలాలను నిల్వ చేశారు. కాలువ లైనింగ్ పటిష్ఠతతో పాటు నీటి మళ్లింపు కోసం ప్రత్యేకంగా తూములు.. గేట్లను ఏర్పాటు చేసి.. నీటి నిల్వలు చేపట్టడంతో చెరువుల్లో నీటి వసతి ఏర్పడింది. దీంతో ఈ ప్రాంతంలో భూములు పంటలతో కళకళలాడుతున్నాయి.

## పుంగనూరు తెదేపాలో భగ్గుమన్న విభేదాలు

### తంబళ్ల పల్లెలోనూ అదే పరిస్థితి

### ఇరువర్గాలకు సర్దిచెబుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

తిరుపతి: క్రమశిక్షణకు మారుపేరైన తెలుగు తమ్ముళ్లు గాడి తప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎన్నడూ లేనివిధంగా పుంగనూరు తెదేపా శ్రేణులు.. సోమవారం మధ్యాహ్నం తిరుపతి నగరంలోని ఓ హోటల్‌లో పరస్పర దాడులు చేసుకున్నారు. వైకాపా అధికారంలో ఉన్న సమయంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అరాచకాలపై గళమెత్తిన తెలుగుదేశం ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముల్లంగి వెంకట రమణపై ప్రస్తుత ఇన్‌ఛార్జి చల్లా బాబు వర్గీయులు దాడి చేసి తల పగలకొట్టారు. మరికొందరిపైనా పిడిగుద్దుల వర్షం కురిపించారు. ఆ సమయంలో చల్లా బాబుతోపాటు మంత్రులు జనార్దన్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, జోనల్ కో ఆర్డినేటర్ దామచర్ల సత్య అదే హోటల్‌లో ఉండటం గమనార్హం. ఒక్కసారిగా పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో నాయకులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఈ దాడుల పరంపర కొనసాగే అవకాశం ఉందని భావించిన మంత్రులు సమావేశం వాయిదా వేశారు. లేదంటే రణరంగంగా మారి ఉండేది. ప్రధానంగా రొంపిచెర్ల మండలం నుంచి వచ్చిన నాయకులతోనే సమస్య తలెత్తిందనే అభిప్రాయం వినిపిస్తోంది.

నాయకులు లేకపోవడంతో : తంబళ్లపల్లె నియోజకవర్గ అభిప్రాయ సేకరణ కార్యక్రమం సైతం ఉత్కంఠగా జరిగింది. వాగ్వాదాలతో మొదలై తోపులాటల వరకు వెళ్లింది. తంబళ్లపల్లె ఇన్‌ఛార్జి నియామకం అంశంలో కేవలం కార్యకర్తల నుంచే వివరాలు తీసుకున్నారు. శంకర్ యాదవ్, జయచంద్రారెడ్డిలను అక్కడ లేకుండా చేయడంతో దాడుల వరకు వ్యవహారం వెళ్లలేదు. ఇదేవిధంగా పుంగనూరు అంశంలోనూ వ్యవహరించి ఉంటే పరిస్థితి చేయి దాటకుండా ఉండేది. శాప్ ఛైర్మన్ రవినాయుడు తిరుపతిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముల్లంగి వెంకటరమణను పరామర్శించారు. పార్లమెంటు అధ్యక్షుడు సుగవాసి ప్రసాదబాబు సైతం ఆసుపత్రికి వచ్చారు.

వైకాపా హయాంలో చిత్రహింసలు ; వైకాపా హయాంలో 2023 ఆగస్టు 4న పుంగనూరు మండలం భీమగానిపల్లె కూడలిలో పోలీసులు-తెదేపా శ్రేణుల మధ్య అల్లర్లు జరిగాయి. ఈ కేసులో ముల్లంగి వెంకటరమణను అరెస్టు చేసేందుకు పోలీసులు హైదరాబాద్‌లో రోజుల తరబడి గాలించారు. ఆయనను అరెస్టు చేసి కల్లూరుకు తీసుకొస్తున్న క్రమంలో చిత్రహింసలు పెట్టారు. స్టేషన్‌కు తీసుకొచ్చిన తర్వాత నోట్లో వస్త్రాలు కుక్కి మరీ కొట్టారు. వైకాపా నేతలకు వీడియో కాల్ ద్వారా ఈ పర్వాన్ని చూపించారు. ఆయనపైనే ప్రస్తుతం సొంత పార్టీ కార్యకర్తలు దాడులు చేశారు.

కార్యకర్తల అభిప్రాయంతోనే : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ ఇన్‌ఛార్జిని నియమించాలని అధిష్ఠానం ఆదేశించింది. 2, 3 సార్లు తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎంపికపై చర్చలు జరిగినా కొలిక్కి రాలేదు. ఈ విషయంలో ఎవరు అడ్డుపడుతున్నారు? ఎవరు బల ప్రదర్శనకు దిగుతున్నారో పార్టీ వద్ద స్పష్టమైన నివేదిక ఉంది. బల ప్రదర్శనలతో ఉపయోగం లేదు. కార్యకర్తల అభిప్రాయంతోనే నిర్ణయాలు ఉంటాయి. - బీసీ జనార్దన్‌రెడ్డి, ఇన్‌ఛార్జి మంత్రి

## అవకాశం ఈ ఒక్క రోజే

### ఎన్యూమరేషన్ పత్రం ఇస్తేనే ముసాయిదా జాబితాలో పేరు

### పూతలపట్టులో బీఎల్‌వోలతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, తిరుపతి: ఈనెల 21న విడుదల చేసే ముసాయిదా ఓటరు జాబితాలో మీ పేరు ఉండాలంటే ఈ ఒక్కరోజే అవకాశం. ఇప్పటికే ఓటు హక్కు కలిగి ఎన్యూమరేషన్ పత్రాలు అందుకుని తిరిగి వాటిని బూత్ స్థాయి అధికారి (బీఎల్‌వో)కి ఇవ్వకుంటే మీ పేరు జాబితాలో ఉండదు. మళ్లీ ఓటు హక్కు పొందాలంటే కొత్తగా నమోదు చేసుకోవాల్సిందే. సోమవారం సాయంత్రానికి జిల్లాలో ఇంకా 13,386 మంది ఎన్యూమరేషన్ పత్రాలను వెనక్కి ఇవ్వలేదు. వీరి కోసం ప్రయత్నించినా ఇళ్లలో లేరని, ఫోన్ చేసినా సమాధానం చెప్పడం లేదని బీఎల్‌వోలు అంటున్నారు. ఒకవేళ అందుబాటులో లేకుంటే ఈసీఐ వెబ్‌సైట్‌లోకి వెళ్లి అయినా ఆన్‌లైన్‌లో ఎన్యూమరేషన్ పత్రాన్ని నింపవచ్చు. అప్పుడే ముసాయిదా జాబితాలో చోటు ఉంటుంది.

**కుప్పంలో 5,954.. చిత్తూరులో 4,153 మంది :** చిత్తూరు జిల్లాలో 13,40,126 మంది ఓటర్లు ఉండగా సోమవారం సాయంత్రం 6 గంటలకు ఇంకా 13,386 మంది ఎన్యూమరేషన్ పత్రాలు వెనక్కి ఇవ్వలేదు. అత్యధికంగా కుప్పం నియోజకవర్గంలో 5,954 మంది, చిత్తూరులో 4,153 మంది ఉన్నారు. పూతలపట్టులో 1,720, పలమనేరు 1,180, గంగాధరనెల్లూరులో 378, నగరిలో కేవలం ఒక్కరు మాత్రమే ఫాంలు సమర్పించాలి. నగరి నియోజకవర్గంలో 100 శాతం డిజిటైజేషన్ పూర్తయింది. కుప్పంలో 97.42 శాతమే జరిగింది. ఫాంలు తీసుకున్న కొందరు ఉపాధి కోసం బెంగళూరు వెళ్లారని అంటున్నారు. స్థానికులతోనైనా వారిని మాట్లాడించి అవసరమైతే బీఎల్‌వోలే ఆన్‌లైన్ ద్వారా నింపడంలో వారికి సాయం చేయాలి.

## మ్యాపింగ్ చిక్కులు.. తప్పని తిప్పలు

### సర్వే లోపాలతో ఇబ్బందులు

చిత్తూరు కలెక్టరేట్, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందాలంటే హౌస్ హోల్డ్ మ్యాపింగ్ సర్వేలోని వివరాలే ఆధారం. గతంలో చేపట్టిన సర్వేలో పొరపాట్లు అర్హులకు శాపంగా మారాయి. కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారని, ఆధార్ నంబర్ల తప్పుడు మ్యాపింగ్ తదితర కారణాలతో చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు.

ఆప్షన్ పునరుద్ధరించక : రియల్‌టైమ్ సాంకేతికత ఆధారంగా హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో సవరణకు అవకాశం ఉన్నా చేయడం లేదన్న విమర్శలున్నాయి. సచివాలయాల్లో ఆన్‌లైన్ ఆప్షన్‌ను పునరుద్ధరించడం లేదు. దీంతో కొందరు విద్యుత్తు రాయితీలకు దూరమవగా మరికొందరికి తల్లికి వందనం అందడం లేదు. తప్పులు సరిచేయాలని బాధితులు కోరుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదు.

సవరణ జరిగేనా : గత ప్రభుత్వంలో చేపట్టిన సర్వేలో తప్పులు సరిదిద్దేలా కూటమి ప్రభుత్వం గతేడాది డిసెంబర్‌లో ఏకీకృత కుటుంబ సర్వేను ప్రారంభించి పూర్తిచేసింది. కొన్ని తప్పులు మళ్లీ నమోదు కావడంతో మరోసారి సమగ్ర వివరాలు నమోదు చేసింది. వీటిపై అభ్యంతరాల స్వీకరణకు ఇటీవలే గ్రామసభలు నిర్వహించారు. ఏకీకృత కుటుంబ సర్వేతో పాత తప్పులు సవరిస్తారో.. లేదో అనే అంశంపై ఇంకా స్పష్టత తొలగలేదు. మ్యాపింగ్ సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రభుత్వం నుంచి అనుమతి రావాలని స్వర్ణ కార్యాలయాల శాఖ అధికారులు చెబుతున్నారు.

# తిరువూరు టీడీపీలో ప్రొటోకాల్ రగడ

**ఊటుకూరులో ప్రారంభోత్సవాల శిలాఫలకంపై ఎమ్మెల్యే పేరు ముద్రించని నిర్వాహకులు**
**ఎంపీ, ఎమ్మెల్యే వర్గాల నడుమ మళ్లీ రాజుకున్న వివాదం**
**ఇరువురు ప్రజాప్రతినిధుల గైర్హాజరు**
**ఎమ్మెల్యేపై పరుష పదజాలంతో మాట్లాడిన సీనియర్ నాయకుడు చెరుకూరి**

తిరువూరు/గంపలగూడెం: గంపలగూడెం మండలం ఊటుకూరు కృష్ణదేవరాయ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సోమవారం ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ఏర్పాటు చేసిన శిలాఫలకంలో ఎమ్మెల్యే పేరు లేదంటూ ఆయన వర్గం సోషల్ మీడియా వేదికగా ఆరోపణలు గుప్పించడం వివాదానికి దారి తీసింది. సహకార సంఘంలో ఆధునికీకరించిన కల్యాణమంటపం, ఆర్వో ప్లాంటు ప్రారంభోత్సవం, గ్రామ ప్రముఖుడి విగ్రహావిష్కరణ కార్యక్రమాలకు విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం, రాష్ట్ర ఆర్గానిక్ ప్రోడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్‌లను నిర్వాహకులు ఆహ్వానించారు. శిలాఫలకంపై వారి పేర్లు మాత్రమే ముద్రించారు. స్థానిక శాసనసభ్యుడైన కొలికపూడి శ్రీనివాసరావును ఆహ్వానించకపోగా, ప్రొటోకాల్ ప్రకారం శిలాఫలకంపై ఆయన పేరు కూడా ముద్రించకుండా దళిత ఎమ్మెల్యేను అవమానించారంటూ ఆయన వర్గీయులు సోమవారం సోషల్ మీడియా వేదికగా ధ్వజమెత్తారు. ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి కూడా తీసుకెళ్లడంతో ఎంపీ కేశినేని చిన్ని, కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాలేదు.

**ఎమ్మెల్యేపై ధ్వజం :** ఇదిలావుండగా సహకార సంఘ చైర్మన్ చెరుకూరి రాజేశ్వరరావు కల్యాణ మంటపం ప్రారంభించిన అనంతరం సభలో మాట్లాడుతూ ఎమ్మెల్యే కొలికపూడి తిరువూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని భూస్థాపితం చేయడానికి కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. గ్రామ, మండల కమిటీలు నియమించడంలో ఎమ్మెల్యే ప్రమేయం ఏమిటని, సిన్సియర్ కార్యకర్తలను అణగదొక్కి తన అడుగులకు మడుగులొత్తే వారితో కమిటీలు వేయాలని ఎమ్మెల్యే యత్నించడంతో తామంతా వ్యతిరేకించామన్నారు. ఎమ్మెల్యే నియోజకవర్గంలో పర్యటించేటపుడు పార్టీ పదవుల్లో ఉన్న నాయకులకు కనీస మర్యాద ఇవ్వరని, వారికి సమాచారం ఇవ్వకపోవడం గర్హనీయమని అన్నారు. ఎదుటివారిని గౌరవించని ఎమ్మెల్యేని ఎవరూ గౌరవించరని, ఇటీవల జరిగిన మహానాడు కార్యక్రమంలో కూడా ఎమ్మెల్యే కనీసం పట్టించుకోలేదని, కార్యకర్తలే నిర్వహించారన్నారు. తమకు పార్టీయే ముఖ్యమని, పార్టీ ఆదేశానుసారం నడుచుకుంటామని చెరుకూరి అనడం గమనార్హం.

# నీట ముంచిన నిర్లక్ష్యం

**తొలకరి ముందు బుడమేరు డైవర్షన్ కెనాల్ లైనింగ్ పనులు ప్రారంభం**
**పట్టిసీమ నీటి రాకతో నిలిచిన డైవర్షన్ కెనాల్ లైనింగ్ పనులు**
**ప్రభుత్వ తీరుతో నిర్మాణ దశలో మునిగిన బ్యాలెన్స్ రిటైనింగ్ వాల్**
**భారీ వర్షం పడితే మరోసారి వరద ముంపు ప్రమాదం**

జి.కొండూరు: బుడమేరు ఉగ్రరూపం దాల్చి డైవర్షన్ కెనాల్‌కు గండ్లు పడటంతో వరద ముంపు నకు గురై రెండేళ్లు కావస్తున్నా ప్రజల్లో బుడమేరు భయాన్ని తొలగించడంలో ప్రభుత్వం సఫలం కాలేదు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం, నిర్దిష్ట ప్రణాళిక లేకపోవడం బుడమేరు డైవర్షన్ కెనాల్ ఆధునికీకరణ పనులకు పెను శాపంగా మారింది. గండ్ల వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులే ఏడాదిగా పూర్తి చేయలేని ప్రభుత్వం లైనింగ్ పనులను హడావిడిగా చేపట్టింది. తొల కరి వానలతో ఈ పనులు సైతం నత్తనడకన సాగుతూ పట్టిసీమ నీటి విడుదలతో పూర్తిగా నిలిచిపోయాయి. లైనింగ్ పనులు చేస్తున్న యంత్రాలు ఒడ్డుకు చేరాయి. నిర్మాణాలు మునిగిపోయాయి. మరో ఆరు నెలలపాటు ఈ పనులు ప్రారంభమయ్యే అవకాశం లేదు. లైనింగ్ పనుల కోసం కెనాల్ గట్లను తవ్వి వదిలేయడంతో పట్టిసీమ నీటి ప్రవాహానికి కోతకు గురవుతు న్నాయి. భారీ వర్షాలు కురిస్తే గండ్లు పడి మరో సారి వరద ముంచెత్తే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**హడావుడి పనులకు బ్రేక్ :** బుడమేరు హెడ్ రెగ్యులేటర్ నుంచి కృష్ణానది వరకు 11.90 కిలోమీటర్ల మేర బుడమేరు డైవర్షన్ కెనాల్ ఉంది. ఈ కాలువ అటు బుడమేరు వరద ప్రవాహంతో పాటు ఇటు పోలవరం కుడి ప్రధాన కాలువ ద్వారా వచ్చే పట్టిసీమ నీటిని సైతం కృష్ణానదిలో కలుపుతుంది. 2024 ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు బుడమేరు డైవర్షన్ కెనాల్‌కు భారీ గండ్లు పడి విజయవాడ పరిసర ప్రాంతాలన్నీ రోజుల తరబడి నీట మునిగాయి. భారీగా ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లింది. ఆ తర్వాత బుడమేరు ఆధునికీకరణ చేస్తామంటూ ముఖ్యమంత్రి నుంచి అధికార పార్టీ నాయకులందరూ ఊదరగొట్టారు. వరదలొచ్చిపోయిన 20 నెలల తర్వాత ఇటీవల బుడమేరు డైవర్షన్ కెనాల్ ప్రారంభం నుంచి 8.3 కిలోమీటర్ల వరకు లైనింగ్ పనులకు ప్రభుత్వం రూ.121 కోట్లు మాత్రమే కేటాయించింది. వర్షాలు పడితే ముందుకు సాగవని తెలిసినా మే నెలలో హడావుడిగా ఆలైనింగ్ పనులు ప్రారంభించింది. జూన్‌లో తొల కరి జల్లులతో నత్తనడకన సాగిన ఈ పనులు పట్టిసీమ నీటి రాకతో ఈ నెల 11వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో నిలిచిపోయాయి. ఒకవేళ వర్షాలు కురవకపోతే పట్టిసీమ నీటి విడుదల కొనసాగే అవకాశం ఉంది. వర్షాలు అధికంగా కురిస్తే ఎగువ నుంచి వచ్చే వరద ప్రవాహం డైవర్షన్ కెనాల్ నుంచే కృష్ణానదిలో కలవాల్సి ఉంది. దీనితో మరో ఆరు నెలల పాటు లైనింగ్ పనులు ప్రారంభమయ్యే అవకాశం కనిపించడంలేదు. హడావుడిగా చేపట్టిన లైనింగ్ పనులు, బ్యాలన్స్ రిటైనింగ్ వాల్ నిర్మాణం మధ్యలోనే ఆగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. బ్యాలెన్స్ రిటై నింగ్ వాల్ నిర్మాణం కోసం కట్టను ఎడమ వైపు తవ్వి వదిలేయడంతో పట్టిసీమ నీటి ప్రవాహానికి కోతకు గురవుతోంది. ఒకవేళ భారీ వర్షాలు పడి ఎగువ నుంచి వరద పోటెత్తితే, కోతకు గురైన ప్రదేశంలో గండి పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెను ప్రమాదం సంభవించకముందే అధికారులు అప్రమత్తం కావాలని కోరుతున్నారు.

# గాదె సాయికృష్ణ కేసులో మరో ట్విస్ట్

**అప్రూవర్‌గా మారనున్న సీఐ నాగరాజు స్నేహితుడు**
**కోర్టుకు సమర్పించిన మెమోలోనూ నిందితుడిగా అతని పేరు**




ఆంధ్రప్రదేశ్‌లో సంచలనంగా మారిన గాదె సాయికృష్ణ కేసు ఇప్పుడు మరో మలుపు తిరిగింది. ఈ కేసులో అరెస్టయిన వారు ఇప్పటి వరకు నోరు విప్పలేదు. సిట్ అధికారులు ఎంత ప్రశ్నించినా ఎలాంటి సమాధానం చెప్పలేదు. అయితే, సీఐ నాగరాజు స్నేహితుడు అయిన సురేష్ ఇప్పుడు కీలకంగా మారారు. కోర్టుకు సమర్పించిన మెమోలో సిట్ అధికారులు సురేష్‌ను నిందితుడిగా పేర్కొన్నా, ఇప్పటి వరకు అరెస్టు చూయించలేదు. అనేక సార్లు ప్రశ్నించిన అనంతరం, సురేషే ఈ కేసులో కీలకమని.. అప్రూవర్‌గా మారే వీలున్నట్లు తెలుస్తోంది.

ఈ సురేష్ ఎవరంటే సీఐ నాగరాజుకు సన్నిహితంగా ఉండే వ్యక్తి. దాంతో పాటు ఈ కేసు వ్యవహారంలో చాలా విషయాలు సురేష్‌కు తెలుసు. కృష్ణలంక స్టేషన్‌లో అనధికార అధికారం కూడా చెలాయించేవాడని తెలుస్తోంది. ముఖ్యంగా సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నప్పటి నుంచి మృతి చెందడం, శవం మాయం చేయడం వరకూ అన్ని అంశాలు సురేష్‌కు పూసగుచ్చినట్లు తెలుసంటూ సిట్ అధికారులు అతని నుంచి కీలక సమాచారం రాబట్టారు.

స్టేషన్ నుంచి సాయికృష్ణను ఎందుకు బయటకు తీసుకెళ్లారు? ఎవరు తీసుకెళ్లారు? ఎక్కడెక్కడ తిప్పారు? ఆ తర్వాత ఎప్పుడు స్టేషన్‌కు తీసుకొచ్చారు? అనే వివరాలను సిట్ అధికారులు అతని నుంచి రాబట్టినట్లు తెలుస్తోంది. దాంతో ఈ కేసులో సురేష్ వాంగ్మూలం ఆధారంగా సాయికృష్ణ మరణంపై ఓ క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

గాదె సాయికృష్ణ లాకప్ డెత్ ఆరోపణలతో అరెస్టయిన ఐదుగురు నిందితులు విచారణలో ఇప్పటి వరకు నోరు విప్పలేదు. కనీసం స్టేషన్ సిబ్బంది కూడా తమకేమీ తెలియదనే చెబుతున్నారు. అయితే, సురేష్ మాత్రం ఏం జరిగిందో పూస గుచ్చినట్టు సిట్ అధికారుల ముందు చెప్పినట్లు తెలుస్తోంది. అరెస్టయిన వారే కాకుండా మరో ఇద్దరు, ముగ్గురు కీలకంగా వ్యవహరించారని.. వాళ్ల పేర్లు కూడా సురేష్ సిట్‌కు చెప్పేశారు. సాయికృష్ణ ఉదంతం జరుగుతున్న సమయంలో తామంతా బయటే ఉన్నట్లు కూడా సురేష్ చెప్పడం విశేషం. సురేష్ చెప్పిన విషయాలు నిజమా? లేక అబద్ధమా? అన్న కోణంలో సిట్ అధికారులు విచారిస్తున్నారు.

# ఏపీలో మరో 175 ఎంబీబీఎస్ సీట్లకు అనుమతి

## నీట్ విద్యార్థులకు భారీ ఊరట

ఆంధ్రప్రదేశ్‌లో వైద్య విద్య విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ప్రభుత్వ వైద్య కళాశాలలకు అదనంగా 175 ఎంబీబీఎస్ సీట్లను కేటాయించినట్లు ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటించారు. ఈ మేరకు నేషనల్ మెడికల్ కమిషన్ సోమవారం లెటర్ ఆఫ్ పర్మిషన్ జారీ చేసినట్లు వెల్లడించారు. పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాలకు 100 ఎంబీబీఎస్ సీట్లు, విజయవాడ ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలకు అదనంగా 75 సీట్లు మంజూరయ్యాయని తెలిపారు. దీంతో ఏపీలో వైద్య విద్య అవకాశాలు మరింత పెరగనున్నాయని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలోనే రాష్ట్రంలోని నాలుగు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కలిపి 325 అదనపు ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చినట్లు మంత్రి తెలిపారు. అలాగే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మొత్తం 505 అదనపు సీట్లు పెరిగినట్లు పేర్కొన్నారు. ప్రైవేట్ వైద్య కళాశాలల్లో కూడా 550 అదనపు ఎంబీబీఎస్ సీట్లు మంజూరయ్యాయని చెప్పారు. దీంతో కూటమి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు కలిపి మొత్తం 1,055 అదనపు సీట్లు అందుబాటులోకి వచ్చాయని వెల్లడించారు.

ఈ నిర్ణయం వల్ల నీట్ మెరిట్ విద్యార్థులకు భారీ ఊరట లభించనుందని మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యానించారు. ముఖ్యంగా ప్రైవేట్ వైద్య కళాశాలల్లో పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రయోజనం చేకూరేలా కన్వీనర్ కోటాలో 50 శాతం సీట్లు అందుబాటులో ఉండటం మరింత ఉపయుక్తంగా మారనుందని తెలిపారు. ఏపీలో వైద్య విద్యా అవకాశాలను విస్తరించడంతో పాటు, భవిష్యత్తులో వైద్యుల కొరతను తగ్గించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. ఈ అదనపు సీట్లతో మరి కొంతమంది విద్యార్థులు తమ వైద్య విద్య కలను సాకారం చేసుకునే అవకాశం పొందనున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# సోషల్ మీడియాలో వివాదాస్పద వ్యాఖ్యలే త్వరగా వైరల్ అవుతున్నాయి : రాయపాటి శైలజ



విజయవాడ, జులై 12 : నేటి కాలంలో డాక్యుమెంటరీలు లేదా షార్ట్ ఫిలిమ్స్ కంటే సినిమాలే యువతను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయని ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ వ్యాఖ్యానించారు. ప్రజలు మంచి కంటే చెడు వైపు త్వరగా ఆకర్షితులు అవుతున్నారని పేర్కొన్నారు. ఈరోజు (ఆదివారం) విజయవాడలో జరిగిన మూడో ప్రపంచ తెలుగు రచయిత్రుల మహాసభల ముగింపు వేడుకల్లో ముఖ్య అతిథిగా రాయపాటి శైలజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శైలజ ప్రసంగించారు.

**వాటిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉంది :** మహిళా రచయితలు తమ కవితలను, రచనలను, జీవిత అనుభవాలను సినిమా స్క్రిప్టులుగా మార్చాలని రాయపాటి శైలజ సూచించారు. ఆడపిల్లలపై సినిమాల వల్ల కలిగే ప్రతికూల ప్రభావాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పుకొచ్చారు. తెలుగు సాహిత్యం కేవలం వినోదం కోసం మాత్రమే కాదని, అది సమాజానికి దిశానిర్దేశం చేస్తోందని తెలిపారు. తరిగొండ వెంగమాంబ నుంచి నేటి రచయితల వరకు అందరూ సమాజ మార్పు కోసం కృషి చేస్తున్నారని వివరించారు. మహిళలు బయటకు వచ్చి పని చేస్తున్నారంటేనే వారు ప్రయాణాల నుంచి పని ప్రదేశాల వరకు అనేక ఇబ్బందులను ఎదుర్కోవడానికి సిద్ధపడి వస్తున్నారని అన్నారు. రాజకీయాల్లో ఉన్న మహిళలు విమర్శలను తట్టుకోవాలని అంటారని, కానీ వారిపై అభ్యంతరకరంగా మాట్లాడటం సరైనది కాదని పేర్కొన్నారు.

**పుస్తకాలు చదివే విధానంలో మార్పు వచ్చింది :** ప్రస్తుత కాలంలో సోషల్ మీడియాలో మంచి విషయాల కంటే, తప్పుడు మాటలు లేదా వివాదాస్పద వ్యాఖ్యలే త్వరగా వైరల్ అవుతున్నాయని రాయపాటి శైలజ తెలిపారు. మహిళా సాధికారత అంటే కేవలం చదువుకోవడం లేదా ఉద్యోగం చేయడం మాత్రమే కాదని, అది మహిళలకు ఉండే స్వతంత్రమని చెప్పుకొచ్చారు. చాలా సందర్భాల్లో కుటుంబ సభ్యులు మహిళలను వెనక్కు లాగుతుంటారని అన్నారు. కానీ రచయిత్రులకు మాత్రమే కలం, స్వరం ద్వారా సమాజాన్ని మార్చగల శక్తి ఉందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత కాలంలో పుస్తకాలు చదివే విధానంలో మార్పు వచ్చిందని వివరించారు. ఇప్పుడు పుస్తకాలన్నీ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. నేటి తరంలో ఏకాగ్రత తగ్గిపోవడంతో, ప్రజలు ఇన్‌స్టంట్ గ్రాటిఫికేషన్ కోరుకుంటున్నారని అన్నారు. అందుకే సమాచారం 30 సెకన్ల నుంచి ఓ నిమిషంలోపు ఉండాలని భావిస్తున్నారని చెప్పారు.

**బ్లాగులు శక్తివంతమైన సందేశాలను ఇస్తాయి :** బ్లాగులు తక్కువ సమాచారాన్ని అందించినప్పటికీ, అవి చాలా శక్తివంతమైన సందేశాలను ఇస్తాయని రాయపాటి శైలజ వ్యాఖ్యానించారు. ఒక అమ్మాయి పుస్తకం చదివితే ఆమె జీవితం మాత్రమే మారుతుందని, కానీ ఒక మహిళ రచన చేస్తే మొత్తం సమాజమే మారుతుందని వెల్లడించారు. ప్రస్తుత విద్యావ్యవస్థలో కేవలం ట్యాబ్‌లు, డిజిటల్ విద్య మాత్రమే కాకుండా, పుస్తకాలు చదవడం, నీతి కథల ప్రాధాన్యం పెరగాలని సూచించారు. పిల్లల్లో ఉండే సృజనాత్మకతను, శక్తిని గుర్తించి వారిని సరైన మార్గంలో నడిపించడానికి పుస్తకాలు ఎంతగానో తోడ్పడతాయని వ్యాఖ్యానించారు. రచయితల కలం ఎప్పుడూ ఆగకూడదని, నిరంతరం రాస్తూనే ఉండాలని సూచించారు. రచనల ద్వారానే మనం భావితరాలకు, పిల్లలకు గొప్ప విషయాలను అందించగలమని తెలిపారు. ఈ ప్రపంచ రచయిత్రుల మహా సభల ద్వారా మహిళా రచయితలు సమాజంలో మార్పు కోసం కృషి చేయాలని రాయపాటి శైలజ కోరారు.

# బీసీ విద్యార్థుల విద్యకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది: మంత్రి సవిత



వత్సవాయి/ఎన్టీఆర్ జిల్లా, జులై 12 బీసీ విద్యార్థుల విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఏపీ మంత్రి సవిత వ్యాఖ్యానించారు. సన్నబియ్యంతో రుచికరమైన భోజనం అందిస్తున్నామని పేర్కొన్నారు. డైట్ ఛార్జీల బిల్లులు 10 శాతం పెంచబోతున్నామని తెలిపారు. బీసీ బిడ్డలకు రుచికరమైన, కడుపు నిండేలా భోజనం అందిస్తున్నామని చెప్పుకొచ్చారు. బీసీ విద్యార్థులు అత్యున్నత స్థానాల్లో నిలవాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఉద్ఘాటించారు. ఈరోజు (ఆదివారం) వత్సవాయి మండల కేంద్రంలో మంత్రి సవిత పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వత్సవాయి ఎంజేపీ గురుకుల పాఠశాలలో పీ-4 విధానంలో రూ.75 లక్షలతో నిర్మించిన డైనింగ్ హాల్, డార్మెటరీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజగోపాల్, మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడారు.

**సీఎం చంద్రబాబు పీ 4 విధానం తెచ్చారు :** సీఎం చంద్రబాబు ఆశయాన్ని కొనసాగిస్తూ... పీ 4 విధానంలో వత్సవాయి ఎంజేపీ స్కూల్‌ను అభివృద్ధి చేసిన ఎన్ఆర్ఐ చిరుమామిళ్ల రాంబాబు దంపతులను అభినందించారు. చిరుమామిళ్ల రాంబాబు ఎంతో మంది దాతలకు స్ఫూర్తిగా నిలిచారని ప్రశంసించారు. బీసీ గురుకులాలను స్థాపించిన ఘనత దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావుది అని తెలిపారు. సీఎం చంద్రబాబు వందలాది బీసీ గురుకులాలను ఏర్పాటు చేశారని ప్రస్తావించారు. సమాజం నుంచి పేదరికాన్ని పారదోలాలని సీఎం చంద్రబాబు పీ 4 విధానం తీసుకువచ్చారని పేర్కొన్నారు. మన చుట్టు పక్కల ఉన్న పేదల కోసం ధనవంతులు ఎంతో కొంత సాయం చేయాలనే సదుద్దేశంతో పీ 4 విధానాన్ని సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారని ప్రస్తావించారు. కార్పొరేట్ విద్యాసంస్థల కంటే ఎంజేపీ సీట్లకే డిమాండ్ ఎక్కువగా ఉందని వెల్లడించారు.

**ఎంజేపీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు :** పదోతరగతి, ఇంటర్‌లో ఎంజేపీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని మంత్రి సవిత ప్రశంసించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఫొటోతో కూడిన విద్యామిత్ర కిట్లను అందజేస్తున్నామని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీసుకొస్తున్న సంస్కరణల ఫలితంగా పదోతరగతి, ఇంటర్‌లో గతంలో ఎన్నడూలేనివిధంగా ఈ ఏడాది ఫలితాలు వచ్చాయని తెలిపారు. ప్రస్తుతం ఏపీలో 109 గురుకులాలు ఉండగా, ఈ ఏడాది కొత్తగా మరో 10 గురుకులాలను ప్రారంభించామని చెప్పుకొచ్చారు. 6 ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశామని వెల్లడించారు. రూ.500 కోట్ల సాస్కీ నిధులతో ఎంజేపీ గురుకులాలకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేశామని అన్నారు. కొత్తగా బీసీ హాస్టళ్లకు బదులు గురుకులాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. ఎంజేపీ స్కూళ్లు, బీసీ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఆర్వో పాంట్లు, సీసీటీవీ కెమెరాలు, ఇన్వర్టర్లు ఏర్పాటు చేశామని మంత్రి సవిత పేర్కొన్నారు.

# రాజధాని అమరావతిపై గొడ్డలి పార్టీ విష ప్రచారం చేస్తోంది : నక్కా ఆనంద బాబు

అమరావతి: రాజధాని అమరావతి అభివృద్ధిని అడ్డుకునేందుకు వైసీపీ (గొడ్డలి పార్టీ) ఇప్పటికీ కుట్రలు కొనసాగిస్తోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు ఆరోపించారు. రాజధాని అభివృద్ధికి 99.5 శాతం మంది రైతులు భూములు స్వచ్ఛందంగా ఇచ్చారని, భూములు ఇవ్వని అరశాతం మంది రైతులను అడ్డం పెట్టుకుని అమరావతిపై విష ప్రచారం చేస్తోందని విమర్శించారు. ఈ సందర్భంగా సీఆర్డీఏ సీడ్ యాక్సెస్ రోడ్ నిర్మాణం, భూసేకరణ వంటి అంశాలపై మీడియా సమావేశంలో నక్కా ఆనంద బాబు పలు వాస్తవాలను తెలియజేశారు.

ఈ సందర్భంగా నక్కా ఆనంద బాబు మాట్లాడుతూ.. సీఆర్డీఏ చేపట్టిన ఈ-3 సీడ్ యాక్సెస్ రోడ్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారమే జరిగిందని స్పష్టం చేశారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేయాలనే ఉద్దేశంతోనే వైసీపీ వ్యవహరిస్తోందని ఆనంద బాబు పేర్కొన్నారు. 2014 నుంచి 2019 వరకు అమరావతి అభివృద్ధిని అడ్డుకునేందుకు తప్పుడు ఆరోపణలు, ఫిర్యాదులు చేసిన గొడ్డలి పార్టీ.. 2019 నుంచి 2024 వరకు మూడు రాజధానుల పేరుతో రాజధానిని పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆగ్రహించారు. రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెప్పడంతో ఆ పార్టీ 11 అసెంబ్లీ స్థానాలకు పరిమితమైందని, కూటమి ప్రభుత్వం అమరావతే రాష్ట్ర రాజధాని అని పార్లమెంటులో స్పష్టం చేసినా వైసీపీ వైఖరిలో మార్పు రాలేదని అన్నారు.

రాజధాని అమరావతికి కనెక్టివిటీ కోసం నిర్మిస్తున్న ఈ-3 సీడ్ యాక్సెస్ రోడ్ కోసం చేపట్టిన 2.725 ఎకరాల భూసేకరణ అంశాన్ని బూచిగా చూపే ప్రయత్నం ఆ పార్టీ చేస్తోందన్నారు. భూసేకరణకు ముందు అధికారులు పలుమార్లు రైతులతో సమావేశాలు నిర్వహించి, ల్యాండ్ పూలింగ్‌లో చేరితే కలిగే ప్రయోజనాలను వివరించారని ఆనంద బాబు చెప్పారు. నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత కూడా ల్యాండ్ పూలింగ్‌కు అవకాశం కల్పిస్తూ రైతులను ఒప్పించే ప్రయత్నాలు కొనసాగించారని పేర్కొన్నారు. ఉండవల్లి గ్రామంలో తొలుత 20.323 ఎకరాల భూమి అవసరమని సీఆర్డీఏ ప్రతిపాదించగా, అధికారుల చర్చలతో సుమారు 10 ఎకరాల భూమి యజమానులు స్వచ్ఛందంగా సమీకరణకు ముందుకు వచ్చారని ఆయన తెలిపారు. అందులో కొందరు ఇప్పటికే భూములు అప్పగించగా, మరో 5.28 ఎకరాలకు సంబంధించిన సంప్రదింపులు కొనసాగాయని చెప్పారు.

మిగిలిన భూముల విషయంలో రైతులు అంగీకరించకపోవడంతో 10.5 ఎకరాలకు భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేయాల్సి వచ్చిందన్నారు ఆనంద బాబు. భూసేకరణ నోటిఫికేషన్ తర్వాత కూడా రైతులతో అధికారులు చర్చలు కొనసాగించడంతో, మరికొందరు ల్యాండ్ పూలింగ్‌కు అంగీకరించారని తెలిపారు. వైసీపీ అధినేతను కలిసిన అనంతరం ఆయన రాజకీయ ఉద్దేశాలను గ్రహించిన ఓ రైతు 1.12 ఎకరాల భూమిని స్వచ్ఛందంగా సమీకరణకు ఇచ్చేందుకు ముందుకు వచ్చారని చెప్పారు. దీంతో నోటిఫికేషన్ పరిధిలోని సుమారు 10 ఎకరాల్లో 7 ఎకరాలకు పైగా భూమి యజమానులు ల్యాండ్ పూలింగ్‌కు అంగీకరించినట్లు వివరించారు.

చివరకు మిగిలిన 2.725 ఎకరాల విషయంలో మాత్రమే తప్పనిసరి పరిస్థితుల్లో భూసేకరణ ప్రక్రియను కొనసాగించాల్సి వచ్చిందని ఆనందబాబు తెలిపారు. ఈ భూములకు సంబంధించిన అవార్డు ఇప్పటికే పాస్ అయిందని, ప్రస్తుతం చట్టపరమైన నిబంధనల ప్రకారం భూసేకరణ ప్రక్రియను అధికారులు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులను ఒప్పించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నించినప్పటికీ, కొద్ది మంది రైతులను అడ్డం పెట్టుకుని వైసీపీ రాజధాని అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తోందని, మెజారిటీ రైతుల అభిప్రాయాలను గౌరవించడం లేదని నక్కా ఆనందబాబు ఆరోపించారు.

# ఆల్మట్టి డ్యాం ఎత్తుపై పోరాడకుండా రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న చంద్రబాబు : సజ్జల

అమరావతి : ఏపీలోని నీటిపారుదల ప్రాజెక్టులపై చంద్రబాబు నిర్లక్ష్యం చేస్తున్నారని వైఎస్ఆర్ సీపీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. నెల్లూరులో వైఎస్ఆర్‌సీపీ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి ఎత్తు ఇప్పటికి రెండుసార్లు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే పెంచినా కూడా దీనిపై స్పందించలేదని విమర్శించారు. రాయలసీమ లిఫ్టును ఆపేసి రాయలసీమకు, ఆల్మట్టి ఎత్తుపై పోరాడకుండా రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నాడని మండిపడ్డారు. పోలవరం సహా అన్ని సాగునీటి ప్రాజెక్టులను ప్రభుత్వ నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. శ్రీశైలానికి వరద తగ్గడం, ఎగువన ప్రాజెక్టుల వల్ల రాయలసీమ, నెల్లూరులకు నీటి సంక్షోభం ఏర్పడుతోందని పేర్కొన్నారు. సమస్యను అధిగమించాలంటే గత ప్రభుత్వంలో రూ. 900 కోట్లతో పంపింగ్ మినహా సివిల్ పనులు దాదాపు పూర్తయిన రాయలసీమ లిఫ్ట్ ను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమ లిఫ్టును ఆపేసి రాయలసీమకు, ఆల్మట్టి ఎత్తుపై పోరాడకుండా రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నాడని మండిపడ్డారు. పోలవరం సహా అన్ని సాగునీటి ప్రాజెక్టులను ప్రభుత్వ నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. శ్రీశైలానికి వరద తగ్గడం, ఎగువన ప్రాజెక్టుల వల్ల రాయలసీమ, నెల్లూరులకు నీటి సంక్షోభం ఏర్పడుతోందని పేర్కొన్నారు. సమస్యను అధిగమించాలంటే గత ప్రభుత్వంలో రూ. 900 కోట్లతో పంపింగ్ మినహా సివిల్ పనులు దాదాపు పూర్తయిన రాయలసీమ లిఫ్ట్ ను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి కోసమే ఈ పనులను నిలిపివేసి రాయలసీమ ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఈ అన్యాయంపై అసెంబ్లీ స్థాయి కమిటీలతో పౌర సమాజాన్ని కలుపుకుని పోరాడేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోందని తెలిపారు. కేంద్రంలో భాగస్వామిగా ఉండి కూడా రాష్ట్రానికి అవసరమైన వాటిపై కనీసం ప్రశ్నించడం లేదని విమర్శించారు.

# 17న రాయపాడు స్టేషన్ శుభారంభం...

**విజయవాడ, జులై 13, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రైల్వేస్టేషన్ అందుబాటులోకి రానుంది. విజయవాడ శివారు ప్రాంతంలోని రాయనపాడు రైల్వేస్టేషన్ జులై 17వ తేదీ నుంచి అందుబాటులోకి రానుంది. జులై 17న రైల్వేస్టేషన్ ప్రారంభించేందుకు అధికారులు ముహూర్తం ఖరారు చేశారు. విజయవాడ రైల్వేస్టేషన్‌పై రద్దీ పడుతున్న నేపథ్యంలో.. ఆ ప్రభావం తగ్గించేందుకు రాయనపాడును శాటిలైట్ స్టేషన్‌గా అభివృద్ధి చేశారు. అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద రూ.35 కోట్లతో ఆధునికీకరణ చేపట్టారు రైలు ప్రయాణికులకు గుడ్ న్యూస్.. ఏపీలో కొత్త రైల్వేస్టేషన్ అందుబాటులోకి రానుంది. విజయవాడ సమీపంలోని రాయనపాడు రైల్వేస్టేషన్ జులై 17న ప్రారంభం కానుంది. విజయవాడ రైల్వేస్టేషన్‌పై రద్దీ తగ్గించేందుకు రాయనపాడు రైల్వేస్టేషన్‌ను శాటిలైట్ స్టేషన్‌గా విజయవాడ శివారు ప్రాంతంలో అభివృద్ధి చేశారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ. 35 కోట్లు ఖర్చు చేసి రాయనపాడు రైల్వేస్టేషన్‌లో ఆధునికీకరణ పనులు చేపట్టారు. పనులు పూర్తి కావటంతో జులై 17వ తేదీ రాయనపాడు రైల్వేస్టేషన్ ఆరంభించేందుకు ముహూర్తం ఖరారైంది.మరోవైపు అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద రాయనపాడు రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లు ఆధునీకరించారు. రైలు ప్రయాణికుల కోసం విశ్రాంతి గదులు ఏర్పాటు చేశారు. టికెట్ కౌంటర్లు, టాయిలెట్స్ తీర్చిదిద్దారు. ఆర్వో తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. అలాగే రైలు స్టేషన్ మాస్టర్, ఇతర సిబ్బంది కోసం రైల్వేస్టేషన్‌లో గదులు నిర్మించారు. రైల్వేస్టేషన్ ఎంట్రీతో పాటు మొత్తం ప్రాంగణమంతా పచ్చదనం ఉండేలా తీర్చిదిద్దారు. ఇక్కడ ఇంకో విశేషం ఏమిటంటే స్థానిక ప్రత్యేకతను ప్రయాణికులకు పరిచయం చేసేలా కొండపల్లి బొమ్మల పెయింటింగ్స్ వేశారు.మరోవైపు రాయనపాడు రైల్వేస్టేషన్ మీదుగా ప్రస్తుతం రోజూ 12 రైళ్ల వరకూ రాకపోకలు సాగిస్తున్నాయి. రాబోయే రోజులలో రాయనపాడు రైల్వేస్టేషన్ మీదుగా మరిన్ని రైళ్లను నడపనున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా రూ.5.77 కోట్లతో ఆధునిక టాయిలెట్లు, ఏసీ ప్రీపెయిడ్ వెయిటింగ్ హాల్ నిర్మించారు.దివ్యాంగుల కోసం మరుగుదొడ్లు నిర్మించారు. రూ.13.33 కోట్లతో ప్లాట్‌ఫామ్‌ల ఆధునికీకరణ.. దివ్యాంగులకు అనువుగా టాక్టైల్ పాత్ ఏర్పాటు చేశారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్, రెండు లిఫ్టులు, రైల్వేస్టేషన్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టారు. ఆధునిక సదుపాయాలు, హైటెక్ హంగులతో తీర్చిదిద్దిన రాయనపాడు రైల్వేస్టేషన్ జులై 17న ప్రారంభం కానుంది. ఈ రైల్వేస్టేషన్ అందుబాటులోకి వస్తే విజయవాడ రైల్వేస్టేషన్ మీద ఒత్తిడి తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. అందుకే వేగంగా పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యార్న

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఆ ఇల్లే అందరికి ఆదర్శం

**అనంతపురం, జులై 13, పెన్ పవర్:** అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం కుర్లపల్లిలోని నాగప్ప కుటుంబం ఇప్పుడు అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ఆరు తరాలుగా 80 మందికిపైగా కుటుంబ సభ్యులు కలిసి ఉంటూ.. ఉమ్మడి కుటుంబానికి సరైన నిర్వచనం చెప్తున్నారు. ఆ ఇంట్లో పిల్లాపెద్దా అందరూ కలిసి 85 మంది వరకూ ఉంటారు. వీరిలో 25 మంది వరకూ విద్యార్థులే కావడం విశేషం. ఈ కుటుంబానికి వేరువేరు చోట్ల కలిపి 127 ఎకరాల వరకూ భూమి ఉంది. మగాళ్లు అందరూ ఈ భూమిలో సేద్యం పనులు చూస్తుంటారు. వీరందరికీ వేరువేరుగా ఇళ్లు ఉన్నా కూడా.. వంట మొదలుకుని సేద్యపు పనులు, ఆదాయం వరకూ అంతా ఉమ్మడిగానే జరుగుతుంది.నాగప్ప ఉమ్మడి కుటుంబంలో మొత్తం 85 మంది సభ్యులు ఉన్నారు. వీరందరికీ వేర్వేరు ఇళ్లు ఉన్నాయి. అయితే అందరూ కలిసి ఒకేచోట వండుకుంటారు. కుటుంబంలోని మహిళలు అందరూ కలిసి.. ఉమ్మడి కుటుంబం మొత్తానికి కావాల్సిన వంట ఏర్పాట్లు చూస్తారు. ఒకే వంటగదిలో భోజనం తయారుచేస్తారు. కుటుంబం మొత్తానికి సరిపడాలంటే రోజూ 80 కిలోల బియ్యాన్ని వండాల్సి వస్తుందని మహిళలు చెప్తున్నారు. ఇక ఆదివారం రోజులలో నాన్ వెజ్ రుచిచూడాలంటే కనీసం 30 కేజీల మటన్ లేదా చికెన్ కావాల్సిందేనని చెప్తున్నారు. ఉదయం ఐదు గంటలకు మొదలుపెడితే రాత్రి 9 గంటల వరకూ వంటగదిలో పొయ్యి మంట మండాల్సిందేనట.అయితే ఆరు తరాలుగా.. వీరంతా కలిసి ఉండటానికి బావా బావమరుదులు తీసుకున్న నిర్ణయమే కారణమట.. ఆరునూరైనా మనం కలిసే ఉందామంటూ అరవై సంవత్సరాల కిందట తీసుకున్న నిర్ణయమే వీరంతా ఇలా కలిసి ఉండటానికి కారణంగా చెప్తున్నారు. ఈ కుటుంబానికి మూలమైన నాగప్పకు.. ఇద్దరు భార్యలు. పెద్ద భార్యకు ఒకే కుమార్తె. రెండో భార్యకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. అయితే తన పిల్లలు అందరూ ఒకేచోట కలిసి ఉండాలనే ఉద్దేశంతో నాగప్ప.. పెద్ద భార్య కూతురికి ఇల్లరికం పెళ్లి చేసి అల్లుడిని ఇంటికి తెచ్చుకున్నాడు. ఈ దంపతులకు నలుగురు మగపిల్లలు సంతానం.వీరిలోని హనుమంతరాయుడు.. నాగప్ప రెండో భార్య కొడుకు ముత్యాలప్ప (బావమరిది) కలిసి తమ తాతగారి మాట ప్రకారం ఉమ్మడి కుటుంబంగా కలిసి ఉండాలని నిర్ణయించుకున్నారు. అప్పటి నుంచి వీరంతా కలిసే ఉంటున్నారు. ఈ ఇంట్లో కూడా ఎక్కువగా ఇల్లరికం వివాహాలే జరుగుతుంటాయి. అలా కొడుకులు, మనవళ్లూ, మనవరాళ్లూ, మునిమనవరాళ్లూ ఇలా అందరూ కలిసి 85 మంది అయ్యారు.ఈ కుటుంబానికి 127 ఎకరాల భూమి ఉంది. అలాగే70 వరకూ గేదెలూ, 40 ఆవులూ, వేయికిపైగా గొర్రెలు, మేకలు ఉన్నాయి. సేద్యం ద్వారా ధాన్యం, కూరగాయలు పండిస్తున్నారు. ఇలా పండించిన వాటిలో కుటుంబ అవసరాలు పోనూ మిగతా వాటిని మార్కెట్లో విక్రయిస్తుంటారు. అలాగే నాలుగు ప్రైవేటు బస్సులను నడుపుతూ.. ఏటా 20 లక్షలు సంపాదిస్తున్నారు. ఇలా వచ్చిన ఆదాయాన్ని ఉమ్మడి కుటుంబం కోసం వెచ్చిస్తున్నారు. ఇక్కడ ఇంకో విశేషం ఏమిటంటే వేయి రూపాయలు దాటిన ఏ ఖర్చుకు అయినా.. కుటుంబ పెద్దలు హనుమంతరాయుడు, ముత్యాలప్పల నిర్ణయం తప్పనిసరి. అలా ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు నిలువెత్తు నిదర్శనంగా ఈ ఫ్యామిలీ నిలుస్తోంది.

## పవన్ ట్రాప్ లో జగన్



**నెల్లూరు, జులై13, పెన్ పవర్:** రాజకీయాలు ఇలానే ఉండాలని లేదు. ఒకే విధంగా ఉంటే వాటిని రాజకీయాలు అనరు. చాణక్య నీతి ఆధారంగా రాజకీయాలు సాగుతూ ఉంటాయి. రాజకీయం అంటేనే పరమపద సోపానం లాంటిది. నిచ్చెనలు.. పాములు.. ఇలా చాలా ఉంటాయి. ఇందులో తెలివిగా వ్యవహరించిన వారు మాత్రమే పరమపద సోపానంలో విజయం సాధించగలుగుతారు.గతంలో ఏపీ రాజకీయాలలో వైసీపీ అధినేత రకరకాల చక్రవ్యూహాలు రచించేవారు. ఆయన వెంట నాడు విజయసాయిరెడ్డి.. వంటి నాయకులు ఉండేవారు. వారు తమ బుర్రకు పదును పెట్టి ఆలోచనలు చేసేవారు. వాటిని జనంలోకి తీసుకెళ్లేవారు జగన్. తద్వారా నాడు టిడిపి ప్రభుత్వానికి.. జనసేన పార్టీకి ఇబ్బందికరమైన వాతావరణం కలిగించేవారు. జగన్ వేసిన ఉచ్చులలో ప్రధానంగా వారు చిక్కుకునేవారు. 2019 ఎన్నికల్లో జరిగింది అదే. అందువల్లే జగన్ ఏకపక్షంగా అధికారంలోకి రాగలిగారు.జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత.. టిడిపి తరఫున మహాసేన రాజేష్ సోషల్ మీడియాలో గట్టిగా మాట్లాడేవారు. నాడు మహాసేన రాజేష్ పవన్ కళ్యాణ్.. జగన్ ను విమర్శించేవారు. చంద్రబాబును ఒక్క మాట కూడా అనేవారు కాదు. ఇటీవలి ప్రశ్న రావణ్ కూడా ఏపీ సీఎం, ఐటీ మంత్రిని ఒక్క మాట అనలేదు. కేవలం పవన్ కళ్యాణ్ మీద మాత్రమే దాడి చేసేవారు. ఇష్టానుసారంగా మాట్లాడేవారు. జడ శ్రావణ్ కూడా జన సేన అధినేత ను టార్గెట్ చేసుకొని విమర్శించేవారు.. అయితే ఎన్నడూ కూడా ఏపీ సీఎం, ఆయన కుమారుడిని విమర్శించే వారు కాదు.రావణ్.. జడ శ్రావణ్ వ్యవహార శైలి రోజురోజుకు దారుణంగా మారుతున్న నేపథ్యంలో..పవన్ కళ్యాణ్ పై. తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్న నేపథ్యంలో.. జనసేన నాయకులకు కడుపు రగిలిపోయింది. పవన్ కళ్యాణ్ నుంచి ఆదేశాలు రావడంతో వారు కేసులు పెట్టడం మొదలుపెట్టారు. ఫలితంగా పోలీసులు కేసులు కట్టి రావణ్ మీద చర్యలు తీసుకోవడం మొదలుపెట్టారు. ఒకరకంగా పోలీసులకు అరెస్ట్ చేసే పరిస్థితి మాత్రమే కల్పించి.. తాను ఏంటో నిరూపించుకున్నారు పవన్. ఈ విషయంలో టిడిపికి కూడా పవన్ కళ్యాణ్ మాటకు ఊ కొట్టడం తప్ప మరో మార్గం లేకుండా పోయింది.పవన్ కళ్యాణ్ గట్టిగా నిలబడడంతో రావణ్ లాంటివాళ్ళు ఇప్పుడు నోరు మూసుకొని కూర్చున్నారు. వాస్తవానికి ఇక్కడ రావణ్ లేదా శ్రవణ్ వల్ల వైసీపీకి పెద్దగా ఉపయోగం లేదు. ఎందుకంటే వైసీపీకి దళిత క్రైస్తవులు ఓట్లు ఆల్రెడీ ఉన్నాయి. మొదటి ఎన్నికల్లో కొంత మాత్రమే తగ్గాయి. ఎస్సీ.. ఎస్టీలు కూడా జగన్మోహన్ రెడ్డికి అండగా ఉన్నారు. అలాంటప్పుడు శ్రావణ్ విషయంలో.. రావణ్ విషయంలో జగన్ ఎందుకు తొందర పడుతున్నారు.. ఎందుకు ఆయన వకాల్తా పుచ్చుకుంటున్నారో అర్థం కావడం లేదు. పవన్ కళ్యాణ్ వేసిన ట్రాప్ లో పడి జగన్ ఇబ్బంది పడుతున్నారు. ఇదే సమయంలో హిందువుల పట్ల జగన్మోహన్ రెడ్డిని విలన్ లాగా చిత్రీకరించే ప్రయత్నాన్ని పవన్ విజయవంతంగా పూర్తి చేశారు.

## నిదానంగా సాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ

**విజయవాడ, జులై 13, పెన్ పవర్:** రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ఆశించిన వేగంతో ముందుకు సాగడం లేదనే చర్చ రాజకీయ వర్గాల్లో కొనసాగుతోంది. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువు ముగియడానికి కొద్ది రోజులు మాత్రమే మిగిలి ఉన్నప్పటికీ, నమోదవుతున్న స్పందన ఆశించిన స్థాయికి చేరుకోలేదని సమాచారం. దీంతో అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీలు కూడా ఈ పరిణామాలను ఆసక్తిగా గమనిస్తున్నాయి.అధికారుల సమాచారం ప్రకారం, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా నమోదైన పురోగతి 50 శాతం మార్కును దాటలేదని తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రం ఈ శాతం మరింత తక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో ఓటర్ల వివరాల సేకరణ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని చెబుతున్నారు. దీంతో నిర్ణయించిన గడువులోపు పూర్తి స్థాయిలో ప్రక్రియ పూర్తవుతుందా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.నగర ప్రాంతాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ అక్కడ కూడా ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల సంఘం ఇంటింటికీ అవసరమైన దరఖాస్తు ఫారాలను పంపిణీ చేసినప్పటికీ, వాటిని పూర్తి వివరాలతో తిరిగి సమర్పించే విషయంలో ఓటర్ల నుంచి స్పందన తక్కువగా ఉందని తెలుస్తోంది. ఈ కారణంగా మొత్తం ప్రక్రియ మందగించినట్లు అధికారులు అభిప్రాయపడుతున్నారు.రాజకీయ పార్టీల దృష్టిలో ఈ ప్రక్రియకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఎందుకంటే ఓటరు జాబితాలో పేర్లు సక్రమంగా నమోదు కావడం ఎన్నికల సమయంలో కీలక అంశంగా మారుతుంది. అందుకే అన్ని పార్టీలు తమ తమ కార్యకర్తల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి ఫారాలు సకాలంలో సమర్పించేలా చూడాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు.క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే చాలా మంది ఓటర్లకు ఈ ప్రక్రియపై పూర్తి అవగాహన లేదని తెలుస్తోంది. ఫారాలు ఎలా నింపాలి, ఎవరికి ఇవ్వాలి, ఏ పత్రాలు అవసరం, పాత ఓటరు జాబితాలో పేరు లేకపోతే ఏం చేయాలి వంటి విషయాల్లో ఇంకా సందిగ్ధత కొనసాగుతోందని సమాచారం. ఈ పరిస్థితిని అధిగమించాలంటే అధికారులు, రాజకీయ పార్టీలు, స్థానిక సిబ్బంది కలిసి ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాల్సిన అవసరం ఉందని భావిస్తున్నారు.ప్రత్యేకించి 2002 నాటి ఓటరు జాబితాలో పేరు ఉన్నవారు, లేనివారు అనుసరించాల్సిన విధానం గురించి కూడా ప్రజలకు స్పష్టత కల్పించాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. అవసరమైన పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకుని, గడువు ముగిసేలోపు దరఖాస్తులు పూర్తి చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురుకాకుండా ఉంటాయని సూచిస్తున్నారు.గడువు ముగిసే వరకు మిగిలిన రోజుల్లో నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంపై అధికారులు దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో రాజకీయ పార్టీలు కూడా తమ కార్యకర్తలను మరింత చురుకుగా రంగంలోకి దించి ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నాలు ప్రారంభించే అవకాశం ఉందని భావిస్తున్నారు.మొత్తంగా చూస్తే, ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకం. సరైన సమాచారం, అవసరమైన పత్రాలు, సమయానికి దరఖాస్తుల సమర్పణ వంటి అంశాలపై ప్రతి ఓటరు అప్రమత్తంగా ఉంటేనే ఈ ప్రక్రియ పూర్తిస్థాయిలో విజయవంతమవుతుంది. లేకపోతే తుది ఓటరు జాబితాపై ప్రభావం పడే అవకాశం ఉందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

## ఏజెన్సీ ప్రాంతాలపై జనసేన కన్ను




**విశాఖపట్టణం, జులై 13, పెన్ పవర్:** ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఏజెన్సీ ప్రాంతాలపై అధికార కూటమి ప్రత్యేక దృష్టి సారించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గత ఎన్నికల ఫలితాలను విశ్లేషించిన తర్వాత గిరిజన నియోజకవర్గాల్లో పార్టీ బలాన్ని మరింత పెంచాలని ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని చెబుతున్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ బాధ్యతలో కీలక పాత్రను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు అప్పగించినట్లు ప్రచారం జరుగుతోంది.ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్ ఇటీవల ఎక్కువగా గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానిక సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నారని సమాచారం. రహదారులు, తాగునీరు, విద్యుత్, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెబుతున్నారుప్రత్యేకించి ఎన్నో దశాబ్దాలుగా సరైన రోడ్డు సౌకర్యం లేని గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలుస్తోంది. "అడవి తల్లి బాట" వంటి కార్యక్రమాల ద్వారా మారుమూల ప్రాంతాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేసే పనులు వేగవంతం చేసినట్లు అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ చర్యలతో గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధిపై ప్రజల్లో సానుకూల స్పందన పెరుగుతుందని కూటమి నాయకులు భావిస్తున్నారు.అభివృద్ధితో పాటు గిరిజనులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యల పరిష్కారంపైనా ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు సమాచారం. ముఖ్యంగా అడవి ప్రాంతాల్లో ఏనుగుల సంచారం వల్ల పంటలు, ఆస్తులకు కలుగుతున్న నష్టాన్ని తగ్గించే చర్యలు, విద్యుత్ సౌకర్యాల విస్తరణ, గ్రామీణ కనెక్టివిటీ పెంపు వంటి అంశాలపై సంబంధిత శాఖలు పనిచేస్తున్నాయని చెబుతున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా స్థానిక ప్రజలతో మరింత సన్నిహిత సంబంధాలు ఏర్పడతాయని అధికార పార్టీ అంచనా వేస్తోంది.రాజకీయంగా పరిశీలిస్తే, 2009 నుంచి ఏజెన్సీ నియోజకవర్గాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభావం ఎక్కువగా కొనసాగిందని ఎన్నికల ఫలితాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. 2024 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కూటమి మంచి ఫలితాలు సాధించినప్పటికీ, అరకు పార్లమెంట్ స్థానం మాత్రం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఖాతాలోకి వెళ్లడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వచ్చే ఎన్నికల నాటికి ఏజెన్సీ ప్రాంతాల్లో పార్టీ బలాన్ని పెంచుకోవాలనే లక్ష్యంతో కూటమి ముందుకు సాగుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు చేరువయ్యే అభివృద్ధి కార్యక్రమాలు, స్థానిక సమస్యల పరిష్కారం, గిరిజన సంక్షేమంపై ప్రత్యేక దృష్టి వంటి అంశాల ద్వారా ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలని అధికార పార్టీ ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్నారు.మరోవైపు విపక్షం కూడా ఈ ప్రాంతాల్లో తన బలాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తోంది. దీంతో రానున్న రోజుల్లో ఏజెన్సీ నియోజకవర్గాలు రాష్ట్ర రాజకీయాల్లో మరింత కీలకంగా మారే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలే భవిష్యత్ ఎన్నికల్లో ఈ ప్రాంత ఓటర్ల తీర్పును ప్రభావితం చేసే ప్రధాన అంశాలుగా నిలిచే అవకాశముందని భావిస్తున్నారు.

## హోంశాఖపై అసంతృప్తులు...

**కాకినాడ, జులై 13, పెన్ పవర్:** కూటమిలో కొద్దిపాటి కుదుపు.. హోం శాఖ తీరుపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పోలీసులపై కినుక వహించారని తెలుస్తోంది. సోషల్ మీడియా కేసుల విషయంలో దూకుడుగా వ్యవహరించాలంటూ పోలీసు శాఖలోని టాప్ బాస్‌ల దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన రెస్పాన్స్ రావడం లేదని ఆయన ఆగ్రహంగా ఉన్నాట.కొన్ని రోజులుగా ఆంధ్రప్రదేశ్‌లో రావణ్ అంశం నడుస్తోంది. ఓ సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం.. దానికి జనసైనికులు ఆగ్రహం చెందడం.. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా చాలా చోట్ల కేసులు నమోదు కావడం జరిగింది. ఆ తర్వాత నిషేధిత సంస్థల ఐడియాలజీని ప్రోత్సహించేలా.. వీడియోలు రూపొందించారన్న విషయంపై రావణ్‌పై ఉపా చట్టం కింద కేసు నమోదు చేసే వరకూ అది దారితీసింది.ఈ విషయానికే కొంత ఇబ్బందికర పరిస్థితి ఉన్న తరుణంలో.. ఇప్పుడు కూటమికి మరో సమస్య వచ్చింది.సోషల్‌మీడియాలో చేస్తన్న వ్యాఖ్యలు, తనపైన కానీ ప్రభుత్వంపైన కానీ.. సోషల్ హార్మోనీని దెబ్బతీసేలా పనిచేస్తున్న వారి విషయంలో కానీ పోలీసులు అనుకున్నంత వేగంగా.. స్పష్టంగా పనిచేయడం లేదని పవన్ కళ్యాణ్ భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రశ్న రావణ్ ఒక్కరే కాదు.. మరికొందరిపై కూడా కేసులు నమోదు చేయాలన్నది ఆయన అభిమతమని.. ఆ విషయంలో పోలీసు శాఖ చొరవ చూపిచడం లేదన్న అసంతృప్తి ఆయనలో ఉంది. ఈ విషయాన్ని ఆయన నేరుగా ఓ పోలీసు ఉన్నతాధికారినే అడిగారని కూడా తెలుస్తోంది. విశ్వసనీయంగా తెలిసిన విషయం ప్రకారం ఆయన చాలా సీరియస్‌గానే దీనిపై మాట్లాడారని.. కానీ పోలీసుల నుంచి తాను ఆశించిన సమాధానం రాలేదని తెలిసింది. దీనికి పవన్ కళ్యాణ్ నొచ్చుకున్నారని చెబుతున్నారు. ఆ తర్వాత దానిని సర్దుబాటు చేయడానికి జనసేన– టీడీపీ నుంచి రెండు వైపులా ప్రయత్నాలు జరిగాయి. పోలీసులు ఈ విషయంలో మరింత దూకుడుగా లేకపోవడానికి కారణం.. చర్యలు తీసుకోవాల్సిన వ్యక్తులు తెలంగాణలో ఉండటం. ఇప్పటికే రావణ్, జర్నలిస్ట్ KVR అరెస్టుల వ్యవహారం తెలంగాణలో రచ్చకు దారితీసింది. ఏపీ పోలీసులు ఇష్టారాజ్యంగా వచ్చి ఇక్కడ నుంచి మనుషులు తీసుకెళ్తున్నారంటూ.. పొలిటికల్ పంచాయతీ నడిచింది. ఇప్పుడు ఇంకో స్టెప్ ముందుకు వేస్తే అది అనవసరంగా ఇబ్బందులకు దారితీస్తుందని వారు భావిస్తున్నారు. సాధారణంగా అరుదుగా నమోదు చేసే ఉపా చట్టాన్ని రావణ్‌పై పెట్టడంపై చర్చ నడుస్తోంది. దీనికి సరైన జస్టిఫికేషన్ పోలీసులు ఇవ్వాల్సి ఉంటోంది. చాలా మంది మాజీ IPS, ప్రజా సంఘాల వారు ఈ చర్యను తప్పు పడుతున్నారు. దీనిపై విజయవాడలో రౌండ్ టేబుల్ మీటింగ్ జరిగింది. ఉపాని రాజకీయ ప్రయోనాల కోసం వాడుతున్నారన్న భావనను ఈ సమావేశం వ్యక్తం చేసింది. ఈ పరిస్థితులన్నీ ప్రభుత్వం, పోలీసు శాఖపైన ఒత్తిడి పెంచుతున్నాయి. ఇప్పుడు కొత్త తలనొప్పులు తలకెత్తుకోవడం ఎలా అని.. పోలీసు శాఖ అనుకుంటోంది. అదే సమయంలో ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న పార్టీని ఒప్పించడం సవాల్‌గానే ఉంది. కూటమి ప్రభుత్వంలో ఇంతకు ముందు కూడా ఇలాంటి సిచ్యువేషన్స్ ఎదురయ్యాయి. వాటిని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ క్లియర్ చేసుకుని వచ్చారు. పవన్ కళ్యాణ్ తన సర్జరీ కోసం ముంబై వెళ్లడంతో ఇవాళ కేబినెట్ మీటింగ్ కు హాజరుకాలేదు. ఇది ముందుగానే షెడ్యూల్ అయిన విషయం అయినా ఈ టైమ్‌లోనే ఇలా జరగడం కూడా కూటమిలో కొంచం కుదుపుకు కారణం అయింది.

# లార్డ్స్‌లో ఉమెన్స్ టీమిండియా నయా హిస్టరీ:

## ఇంగ్లాండ్‌పై 270 పరుగుల తేడాతో హర్మన్ సేన ఘన విజయం






**హైదరాబాద్ పెన్ పవర్:** బ్రిటన్: క్రికెట్ మక్కాగా పేరొందిన ప్రతిష్టాత్మక లార్డ్స్ మైదానంలో టీమిండియా ఉమెన్స్ టీమ్ నయా చరిత్ర సృష్టించింది. యస్తికా భాటియా సెంచరీతో కదం తొక్కగా.. క్రాంతి గౌడ్ 7 వికెట్లతో చెలరేగడంతో ఇంగ్లాండ్ మహిళా జట్టుతో జరిగిన ఏకైక టెస్ట్‌లో భారత అమ్మాయిలు 270 పరుగుల భారీ తేడాతో చారిత్రాత్మక విజయాన్ని అందుకున్నారు. 457 పరుగుల లక్ష్యంతో సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లాండ్ 186 పరుగులకే ఔట్ అయ్యింది. 130/6తో నాలుగో రోజు ఆట ఆరంభించిన ఇంగ్లీష్ అమ్మాయిలు భారత బౌలర్ల ధాటికి మరో 56 పరుగులే చేసి చివరి నాలుగు వికెట్లు కోల్పోయిరు. దీంతో ఇండియా 270 పరుగుల భారీ తేడాతో విజయాన్ని నమోదు చేసి చరిత్ర సృష్టించింది. ఈ ఏకైక టెస్ట్‌లో టీమిండియా అమ్మాయిలు ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 285 పరుగులు చేసి ఆలౌట్ అయ్యారు. ఓపెనర్ స్మృతి మందనా (83), కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (58), స్టార్ ఆల్ రౌండర్ దీప్తి శర్మ (57) హాఫ్ సెంచరీలతో రాణించారు. అతిథ్య ఇంగ్లాండ్ అమ్మాయిలు ఫస్ట్ ఇన్నింగ్స్?లో కేవలం 170 రన్స్ మాత్రమే చేసి ఆలౌట్ అయ్యారు. వికెట్ కీపర్ జోన్స్ (52) హాఫ్ సెంచరీతో ఆకట్టుకోగా.. నాట్ స్కీవర్ బ్రంట్ (44) రాణించింది. భారత బౌలర్లలో క్రాంతి గౌడ్ 5 వికెట్లతో ఇంగ్లాండ్ పతనాన్ని శాసించింది. దీంతో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఇండియాకు 115 పరుగుల ఆధిక్యం లభించింది.

సెకండ్ ఇన్నింగ్స్‌లో ఇండియా అమ్మాయిలు దుమ్మురేపారు. వికెట్ కీపర్ యస్తికా భాటియా (113) చారిత్రాత్మక సెంచరీతో కదం తొక్కగా.. స్మృతి మందనా (70), రిచా ఘోష్ (50) అర్ధ సెంచరీలతో ఆకట్టుకున్నారు. ఈ క్రమంలో 341 పరుగుల వద్ద టీమిండియా ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. దీంతో ఫస్ట్ ఇన్నింగ్స్ ఆధిక్యం కలుపుకుని ఇంగ్లాండ్ 457 పరుగుల లక్ష్యంతో సెకండ్ ఇన్నింగ్స్ ఆరంభించింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ ఇంగ్లాండ్ అమ్మాయిలు సత్తా చాటలేకపోయారు. భారత బౌలర్ల ధాటికి 186 పరుగులకే చాప చుట్టేశారు. దీంతో ఇండియా ఉమెన్స్ టీమ్ 270 పరుగుల భారీ తేడాతో విజయాన్ని అందుకుని లార్డ్స్ మైదానంలో సరికొత్త చరిత్ర సృష్టించింది.

# 18 ఏళ్ల బంధానికి బ్రేక్: చెన్నై సూపర్ కింగ్స్ హెడ్ కోచ్ పదవికి స్టీఫెన్ ఫ్లెమింగ్ గుడ్ బై







**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్‌లో మోస్ట్ పాపులర్ టీమ్ చెన్నై సూపర్ కింగ్స్ హెడ్ కోచ్ పదవికి స్టీఫెన్ ఫ్లెమింగ్ గుడ్ బై చెప్పాడు. సీఎస్కే యాజమాన్యం సోమవారం (జులై 13) ఈ విషయాన్ని అధికారికంగా ధృవీకరించింది. పరస్పర అంగీకారంతో సీఎస్కే హెడ్ కోచ్ పదవి నుంచి స్టీఫెన్ ఫ్లెమింగ్ తప్పుకున్నట్లు ఫ్రాంచైజీ తెలిపింది. దీంతో సీఎస్కే, ఫ్లెమింగ్ మధ్య 18 ఏళ్ల సుధీర్ఘ బంధానికి ఎండ్ కార్డ్ పడింది. 2008లో ఆటగాడిగా చెన్నైలో చేరిన ఫ్లెమింగ్.. 2009 నుంచి ఆ జట్టు హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. ఫ్లెమింగ్ సారథ్యంలో చెన్నై జట్టుకు ఐపీఎల్‌లో తిరుగే లేకుండా పోయింది. ఫ్లెమింగ్, ధోనీ కాంబినేషన్‌లో సీఎస్కే 5 ఐపీఎల్ టైటిల్స్, 2 చాంపియన్స్ ట్రోఫీలు గెలిచింది. రికార్డు స్థాయిలో 12 సార్లు ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లోకి ప్రవేశించగా.. 10 ఫైనల్స్‌లో భాగమైంది. అయితే, గత మూడేళ్లుగా ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ అట్టర్ ఫ్లాఫ్ షో కనబర్చింది. భారీ అంచనాలతో బరిలోకి దిగి కనీసం ప్లే ఆఫ్స్ కూడా చేరకుండా లీగ్ దశలోనే ఇంటి దారి పట్టింది. వరుస వైఫల్యాల నేపథ్యంలో జట్టును ప్రక్షాళన చేయాలని సీఎస్కే యాజమాన్యం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఫ్లెమింగ్ తన పదవికి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.

**సీఎస్‌కే ఎల్లప్పుడూ నా గుండెల్లో ఉంటది: ఫ్లెమింగ్**

18 ఏళ్ల సుదీర్ఘ బంధానికి ముగింపు పలుకుతూ సీఎస్కేను వీడటంపై స్టీఫెన్ ఫ్లెమింగ్ భావోద్వేగానికి గురయ్యాడు. సీఎస్‌కే ఎల్లప్పుడూ నా గుండెల్లోనే ఉంటదని పేర్కొన్నాడు. "క్రీడా ప్రపంచంలో పద్దెనిమిదేళ్లు అంటే ఒక జీవితకాలం లాంటిది. కృతజ్ఞత తప్ప ఎలాంటి బాధ లేకుండా జట్టును వీడుతున్నా. చెన్నై సూపర్ కింగ్స్‌తో గడిపిన సమయం నా కోచింగ్ కెరీర్‌లో లభించిన ఒక గొప్ప అవకాశం. మేము సాధించిన ప్రతిదానికీ నేను గర్వపడుతున్నాను. మనందరం కలిసి ఎన్నో మరపురాని విజయాలను జరుపుకున్నాం. కష్ట సమయాలను కూడా చవిచూశాం. నా జీవితాంతం గుర్తుండిపోయే జ్ఞాపకాలను నిర్మించుకున్నాం. సీఎస్‌కే ఎల్లప్పుడూ నా హృదయానికి దగ్గరగా ఉంటుంది. భవిష్యత్‌లో కూడా నేను ఆ జట్టుకు మద్దతు ఇస్తూనే ఉంటాను" అని ఫ్లెమింగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# రూ.91 వేల కోట్ల స్పోర్ట్స్ డీల్.. సియాటిల్ సీహాక్స్‌ను సొంతం చేసుకున్న భారతీయుడు!





**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికన్ ప్రొఫెషనల్ స్పోర్ట్స్ చరిత్రలోనే అత్యంత భారీ ఒప్పందాల్లో ఒకటి నమోదైంది. భారతీయ మూలాలు కలిగిన సిలికాన్ వ్యాలీ దిగ్గజ పెట్టుబడిదారు వినోద్ ఖోస్లా సూపర్ బౌల్ విజేత సియాటిల్ సీహాక్స్‌ను 9.6 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. భారత కరెన్సీ లెక్కల ప్రకారం దీని విలువ రూ.91వేల 200 కోట్లుగా ఉంది. ఈ డీల్‌తో ఇప్పటివరకు ఏ ఎన్‌ఎఫ్‌ఎల్ జట్టుకూ లేని అత్యధిక ధర పలికింది. ఇది కేవలం ఒక జట్టు ఓనర్షిప్ మారడం మాత్రమే కాదు.. గ్లోబల్ స్పోర్ట్స్ రంగంలో టెక్నాలజీ బిలియనీర్ల ప్రభావం ఎంత వేగంగా పెరుగుతోందో చెప్పే మరో కీలక మైలురాయి. ఇప్పటి వరకు ఎన్‌ఎఫ్‌ఎల్ చరిత్రలో అత్యంత ఖరీదైన ఫ్రాంచైజీ కొనుగోలు రికార్డు 2023లో వాషింగ్టన్ కమాండర్స్ కోసం చెల్లించిన 6.05 బిలియన్ డాలర్లదే. కానీ ఇప్పుడు సీహాక్స్ 9.6 బిలియన్ డాలర్ల విలువతో ఆ రికార్డును భారీ తేడాతో అధిగమించింది. ఇటీవల సూపర్ బౌల్ విజయంతో జట్టు బ్రాండ్ విలువ మరింత పెరగడం, వాణిజ్యపరంగా బలమైన స్థాయిలో ఉండటం ఈ భారీ ధరకు ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు. వినోద్ ఖోస్లా ప్రయాణం భారతదేశంలో ప్రారంభమై సిలికాన్ వ్యాలీలో సక్సెస్ స్టోరీగా మారింది. ఐఐటీ ఢిల్లీ నుంచి డిగ్రీ పొందాక ఆయన అమెరికాకు వెళ్లి సన్ మైక్రోసిస్టమ్స్‌ను కో ఫౌండర్ అయ్యారు. అనంతరం ఖోస్లా వెంచర్స్‌ను ప్రారంభించి ఏఐ, హెల్త్ కేర్, క్లీన్ ఎనర్జీ, సాఫ్ట్‌వేర్ వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. టెక్ ప్రపంచంలోని విజయాన్ని ఇప్పుడు ప్రపంచ క్రీడారంగంలోనూ రిపీట్ చేయాలని చూస్తున్నారు.

సీహాక్స్‌ను 1997లో మైక్రోసాఫ్ట్ సహవ్యవస్థాపకుడు పాల్ అలెన్ 194 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేశారు. ఆయన మరణం తర్వాత సోదరి జోడి అలెన్ ఆధ్వర్యంలో జట్టు కొనసాగింది. పాల్ అలెన్ ఇచ్చిన ఆదేశాల మేరకు జట్టును విక్రయించి వచ్చిన నిధులను సేవా కార్యక్రమాలకు వినియోగించనున్నారు. ఎన్‌ఎఫ్‌ఎల్ అనుమతి లభించిన తర్వాత నీరూ ఖోస్లా జట్టు నియంత్రణ బాధ్యతలు చేపట్టనుండగా, వినోద్ ఖోస్లా కూడా కుటుంబ సభ్యులతో కలిసి కీలక పాత్ర పోషించనున్నారు. మట్నత్తానికి మెగా స్పోర్ట్స్ డీల్ ప్రపంచ వ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీయటంతో పాటు కొత్త శకానికి నాంది పలికిందని నిపుణులు అంటున్నారు.

# ఆ విషయంలో అనుష్క ఎన్నడు చింతించలేదా?





కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడు బాలీవుడ్ నుండి వచ్చిన భారీ అవకాశాలను తిరస్కరించడం అంటే సాధారణ విషయం కాదు. -బాహుబలి-, -రుద్రమదేవి- వంటి చిత్రాలతో పాన్-ఇండియా స్టార్‌డమ్ అనుభవిస్తున్న సమయంలో అనుష్క శెట్టికి హిందీ పరిశ్రమ నుంచి వరుస ఆఫర్లు వచ్చాయి. అయితే అప్పటికే తెలుగులో బిజీగా ఉండటం.. ఇతర కమిట్‌మెంట్ల వల్ల ఆ అవకాశాలను పక్కన పెట్టారు. కాలక్రమేణా పరిస్థితులు మారాయి. ఇప్పుడు అదే టాలీవుడ్ అనుష్కను పక్కనబెట్టింది. ప్రస్తుతం బాలీవుడ్ ఆఫర్లు కూడా రాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఏ నటి అయినా? అయ్యో బాలీవుడ్ అవకాశాలు అనవసరంగా వదులుకున్నానే అని వాపోతుంటారు. కానీ అనుష్క మాత్రం అలాంటి వాళ్లందరికీ భిన్నమని తెలుస్తోంది. అనుష్క వ్యక్తిత్వం చాలా ప్రత్యేకమైనది. ఆమె కెరీర్‌ను అవకాశాల సంఖ్యతో కొలవలేదు. నచ్చిన కథ, పాత్రకు ఉండే లోతు మాత్రమే ముఖ్యం. బాలీవుడ్‌లో గ్లామర్ పాత్రలు చేయడం కంటే దక్షిణాదిలో తనకంటూ బలమైన ముద్ర వేసే పాత్రలు చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ఈ నేపథ్యంలోనే అప్పట్లో బాలీవుడ్ వెళ్లలేదే అని తానెప్పుడు బాధపడలేదన్నారు.

పరిశ్రమలో నటిగా అనుష్క స్థానం ఎంతో గౌరవప్రదమైనది. బాలీవుడ్ ఆఫర్లు రాలేదని ఆమె ఖాళీగా కూర్చోలేదు. తన స్థాయికి తగ్గట్లుగా కథా ప్రాధాన్యత ఉన్న సినిమాలపైనే దృష్టి సారించారు.

మాలీవుడ్ లో -కథనార్- వంటి వైవిధ్యభరితమైన ప్రాజెక్టులను ఎంచుకోవడం చూస్తుంటే? ఆమెకు గ్లామర్ హంగుల కంటే అభినయానికి ప్రాధాన్యత ఇచ్చే కథలే ముఖ్యమని అర్థమవుతోంది. పాత అవకాశాల గురించి ఆలోచించి వర్తమానాన్ని వదులుకునే రకం కాదని నిరూపిస్తుంది.

నిజానికి బాలీవుడ్ అవకాశాలు రాకపోవడం అనేది అనుష్క కెరీర్ పరంగా వైఫల్యం కాదు. అది అనుష్క ఎంచు కున్న మార్గం. దక్షిణాదిలో ఆమెకు దక్కిన ఆదరణ, అభిమానుల ప్రేమ ఏ బాలీవుడ్ స్టార్‌కు తీసిపోని విధంగా ఉంటాయి. తాను తిరస్కరించిన ఆ బాలీవుడ్ ప్రాజెక్టుల గురించి తానెప్పుడు పశ్చాత్తాపం చెందలేదు. పైగా తనకంటూ ఓ ప్రత్యేకతను నిలబెట్టుకుని ఐకానిక్ నటిగానే నేటికి కొనసాగుతున్నారు.

అనుష్క స్పష్టమైన విజన్‌తో ముందుకు వెళ్తున్నారనిపిస్తుంది. సినిమా అంటే మార్కెట్ విస్తరణ మాత్రమే కాదు. అది ఒక నటిగా తన ఆత్మ సంతృప్తి అని బలంగా నమ్ముతున్నారు. గతాన్ని తలుచుకుని బాధపడటం కంటే ముందున్న కథల గురించి ఆలోచించడంపైనే దృష్టి పెడతానంటోంది. ఈ పక్వత అనుష్కను మిగతా నటీమ ణులకు భిన్నంగా నిలబెడుతోంది. కెరీర్ అంటే అవకాశాల వేట కాదు. అదొక ప్రయాణం. అనుష్క ఆ ప్రయాణంలో తాను కోరుకున్నట్లుగానే ముందుకెళ్తున్నారు.



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At Shop No: 9, Bunny Xerox, Rtc Comlex, Kavali, Nellore Dist, Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2835" e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965